



'సోమశిల'లో 69.125 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయానికి ఎగువ నుంచి 19,434 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. డ్యాం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 69.125 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 2100, కండలేరుకు 10,000, ఉత్తర కాలువకు 300 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

4 నుంచి ఎస్ఏఎంపీ-2 పరీక్షలు

నెల్లూరు (విద్య), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఈ నెల 4వ తేదీ నుంచి సెల్ఫ్ అసెస్మెంట్ మోడల్ పేపర్-2 (ఎస్ఏఎంపీ-2) పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఈఓ ఆర్.బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌ఈఆర్‌టీ తయారు చేసిన ప్రశ్నపత్రాలను ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు కాంప్లెక్స్‌ల ద్వారా, ఉన్నత పాఠశాలలకు ఎంఆర్‌సీల ద్వారా ఏ రోజుకారోజు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు ఆయా యాజమాన్యాలు వారి సొంత ప్రశ్నపత్రాలతోనే పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. అలాగే జిల్లాలోని రెండు పాఠశాలలకు మాత్రమే 4వ తేదీన సంస్కృతం పరీక్ష ఉంటుందని, మిగిలిన అన్ని పాఠశాలలకు 6 నుంచి 8వతేదీ వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులంతా పరీక్షలకు సన్నద్ధమయ్యేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రేపు డీఆర్సీ సమావేశం

నెల్లూరు (హరనాథపురం), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల మూడవ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు నగరంలోని జడ్పీ సమావేశ మందిరంలో జిల్లా సమీక్ష మండలి (డీఆర్సీ) సమావేశం జరగనుంది. వాస్తవంగా శనివారమే ఈ సమావేశంలో జరగాల్సి ఉండగా అనివార్య కారణాల వల్ల మరుసటి రోజుకు వాయిదా వేశారు. కాగా, ఆదివారం జరిగే ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌తోపాటు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు పాల్గొంటారు. సమావేశ అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు మైనారిటీ అధికారులతో సమీక్ష, 4 గంటలకు వివిధ వర్గాల ప్రజాప్రతినిధులతో మంత్రి ఫరూక్ పాల్గొంటారు. అనంతరం నంద్యాలకు బయలుదేరి వెళతారు.



నెల్లూరులోని మూలస్థానేశ్వరుడి ఆలయంలో భక్తుల సందడి



నోములు నోచుకుంటున్న భక్తులు



బాణసంచా కాల్చుతున్న నగరవాసులు

సంబరంగా దీపావళి

- ఇంటింట లక్ష్మీపూజ... టపాకాయల మోత

నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి) : దీపాల పండుగ దీపావళిని జిల్లావాసులు గురువారం సంబరంగా జరుపుకున్నారు. ఇళ్లు, దేవాలయాలు, వ్యాపార సంస్థలు దీపాల వెలుగులో కళకళలాడాయి. ఉదయం లక్ష్మీదేవిని పూజించి నోరు తీపి చేసుకున్నారు. సాయంత్రం ఇంటింట దీపకాంతులకుతోడు చిన్నారుల కేరింతలు, టపాకాయల మోతతో సందడి చేశారు. ఆలయాల్లో విశేష అలంకరణ, పూజలు జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కేదారేశ్వర నోములు నోచారు. ఇక, జిల్లాలోని మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి కుటుంబ సభ్యులతో, పొంగూరు నారాయణ జనం మధ్య దీపావళి జరుపుకున్నారు. ఈ దీపావళి సందర్భంగా జిల్లాలో రూ.కోట్లలో బాణసంచా వ్యాపారం జరిగింది.

గుంతల రోడ్లకు మహర్దశ

- 'గుంతలు లేని రోడ్లు' కార్యక్రమం నేడు ప్రారంభం
- జిల్లాకు రూ.18.42 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- మరో రూ.64.77 కోట్లకు ప్రతిపాదనలు పంపిన ఆర్అండ్‌బీ

నెల్లూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గుంతలమయంగా మారిన రోడ్లను బాగు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించింది. రానున్న రెండున్నర నెలల్లో గుంతలు కనిపించకుండా ఉండేలా చర్యలు మొదలుపెట్టింది. అందుకుగానూ 'గుంతలు లేని రోడ్లు' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించింది. శనివారం ఈ కార్యక్రమాన్ని విజయనగరం జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రారంభించనుండగా జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు ప్రారంభించనున్నారు. ఇందుకుగాను జిల్లాకు రూ.18.42 కోట్లు కేటాయించగా, ఇందులో రూ.17.50 కోట్లు గుంతలు పూడ్చేందుకు, మరో రూ.92 లక్షలు రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్ల తొలగింపునకు (జంగిల్ క్లియరెన్స్) ఖర్చు చేయనున్నారు. వెంటనే టెండర్లు పిలిచి జనవరి 15లోపు రోడ్లపై గుంతలు పూడ్చాలని జిల్లా అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. మొత్తంగా జిల్లాలో 82 ప్రధాన రోడ్లపై గుంతలను పూడ్చనున్నారు. కాగా జిల్లాలో మరో 24 ప్రధాన రోడ్లను పూర్తిగా బాగు చేసేందుకు జిల్లా ఆర్అండ్‌బీ అధికారులు రూ.64.77 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. త్వరలోనే ఈ ప్రతిపాదనలకు కూడా ఆమోదం లభించే అవకాశాలు ఉన్నట్లు భావిస్తున్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక 45 రోడ్లపై ఏర్పడ్డ గుంతలను అత్యవసరంగా పూడ్చేందుకు 4.16 కోట్లు కేటాయించిన విషయం తెలిసిందే. కాగా 'గుంతలు లేని రోడ్లు' కార్యక్రమంపై ఆర్అండ్‌బీ ఎస్ఈ ఎం గంగాధర 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా శనివారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి, జనవరి 15లోపు రోడ్లపై గుంతలన్నీ పూడుస్తామని వెల్లడించారు.



కార్తీకం.. ముక్తి దాయకం!

ఆధ్యాత్మిక కార్యక్రమాలతో చక్కని ఆరోగ్యం

ఉపవాసాలు, శాకాహార భోజనంతో చక్కని ఫలితాలు

నేటి నుంచి కార్తీక మాసం

శివకేశవులకు అత్యంత ప్రీతికరమైన కార్తీక మాసం ఆరంభమైంది. జన్మజన్మల పాపాలను పటాపంచలు చేసి మానవుడికి మోక్షం కలిగించే మాసంగా ప్రసిద్ధి చెందిన కార్తీక మాసంలో చేసే స్నాన, పూజ, జపాదులు, దానం, దీప దానం, వనభోజనాలు వంటివి విశేషం. శైవ, వైష్ణవ ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడుతాయి. వేకువజామున చన్నీటి స్నానాలు.. శివ, వైష్ణవ ఆలయ దర్శనాలు, ఉపవాసాస దీక్షలు, ఇంటి ముంగిట, ఆలయ ప్రాంగణాలు దీపకాంతులతో కళకళలాడతాయి. ఇంతటి పవిత్రమై మాసంలో చేసే ఆధ్యాత్మిక కార్యక్రమాల ద్వారా చక్కటి ఆరోగ్యం పొందడంతోపాటు ప్రజల్లో భక్తిభావాలు పెంపొందుతాయి.

6

రేషనలైజేషన్ పేరుతో
వీఏఏల బదిలీలు

వరికుంటపాడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రైతుసేవా కేంద్రాల్లో విధులు నిర్వర్తించే వీఏఏలను రేషలైజేషన్ పేరుతో బదిలీలు చేసేందుకు కూటమి ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. అదే జరిగితే ప్రస్తుతం మండలాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగుల సంఖ్య భారీగా తగ్గిపోయే అవకాశం ఉంది. మెట్ట ప్రాంతమైన ఉదయగిరి సబ్ డివిజన్‌లో అలాంటి పరిస్థితి మరీంత ఎక్కువ కానుంది. వరికుంటపాడులో 12మందికిగాను ఆరుగురు, సీతారామపురంలో 9మందికి ఆరుగురు, దుత్తలూరులో 11మందికి ఏడుగురు, మర్రిపాడులో 17మందికి ఏడుగురు, ఉదయగిరిలో 12మందికి 9మందిని బదిలీ చేసేందుకు ఉన్నతాధికారులు ప్రక్రియ ప్రారంభించారు. అయితే మెట్ట ప్రాంతాల్లోని వరి పంటను ప్రామాణికంగా తీసుకొని ఇక్కడి ఉద్యోగులను డెల్టా ప్రాంతాలకు శాశ్వతంగా బదిలీ చేస్తే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవని రైతులు అంటున్నారు. ఈ ప్రాంతంలో అధికంగా మొక్కజొన్న, జొన్న మినుము, పసుపు, శనగ, సజ్జ, పొద్దుతిరుగుడు వంటి పంటలను సాగే చేసే రైతులు భవిష్యత్తులో వర్షాల తాకిడికి రిజర్వాయర్లు, చెరువుల్లోకి నీరు చేరితే వరి సాగువైపు మొగ్గు చూపుతారు. ఇలాంటి తరుణంలో కేవలం వరి సాగు ఈ-క్రాప్‌ను నిర్ధారించి బదిలీలు చేపడితే భవిష్యత్తులో తమకు సలహాలు ఇచ్చే ఉద్యోగులు కనిపించరేమోనని రైతుల్లో అయోమయం నెలకొంది.


అట్టహాసంగా
దీపం-2

- పండుగ వాతావరణంలో ఉచిత సిలిండర్ల పంపిణీ
- జిల్లాలో 4.06 లక్షల మందికి లబ్ధి
- నాలుగు నెలలకోసారి సిలిండర్ అందజేత
- నెల్లూరు, ఆత్మకూరులో పాల్గొన్న మంత్రులు నారాయణ, ఆనం
- నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, ఇతర నాయకుల హాజరు

నెల్లూరు (హరనాథపురం), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : దీపం-2 పథకం ద్వారా జిల్లాలో ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం పండుగ వాతావరణంలో ప్రారంభమైంది. జిల్లాలో 4,06,522 మంది దీపం-2 పథకానికి అర్హులని సివిల్ సప్లయిస్ అధికారులు తేల్చారు. 4 నెలలకు ఓ సిలిండర్ చొప్పున సంవత్సరానికి మూడు సిలిండర్లను అందచేస్తారు. ప్రస్తుతం సిలిండర్ ధర రూ.840. ఒక్కో కనెక్షన్ కలిగిన కుటుంబానికి సంవత్సరానికి రూ.2,520 లబ్ధి చేకూరుతుంది. మొత్తం కనెక్షన్ల మీద ప్రభుత్వానికి రూ. 102 కోట్ల భారం పడుతుంది. ఉచిత సిలిండర్ల కోసం సాధారణ పద్ధతిలో బుక్ చేసుకున్న వారికి శుక్రవారం సిలిండర్లు అందచేశారు. శుక్రవారం నుంచి మార్చి 2025 లోగా మొదటి సిలిండర్ పొందవచ్చు. బుక్ చేసిన 48 గంటల్లో లబ్ధిదారులకు డీబీటీ ప్రభుత్వం ప్రభుత్వం సబ్సిడీని వారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తుంది. రెండో సిలిండర్‌ను ఏప్రిల్ నుంచి జూలైలోగా, 3వ దానిని ఆగస్టు నుంచి నవంబరులోగా లబ్ధిదారులు పొందవచ్చు.

- **టోల్ ఫ్రీ నెంబర్ 1967**

అర్హత ఉండి ఉచిత సిలిండర్ రాలేదని భావిస్తే 1967 టోల్ ఫ్రీ నంబరుకు (మిగతా 4లో)



ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీకి పచ్చ జెండా ఊపుతున్న మంత్రి నారాయణ, టీడీపీ నేత కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి



ఆత్మకూరులో మహిళలకు సిలిండరు అందజేస్తున్న మంత్రి ఆనం



సిలిండర్ల వాహనాన్ని అడ్డుకున్న స్థానికులు

సిలిండర్లలో చేతివాటం!

- ఒకదానిలో ఉన్న గ్యాస్ మరో సిలిండర్‌లోకి!
- ఏజెన్సీ సిబ్బందిని పట్టుకున్న స్థానికులు



ఖాళీ సిలిండర్‌కు గ్యాస్ లోడు చేసే పరికరాన్ని చూపిస్తున్న రైతు

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు, డెలివరీ బాయ్‌ల కక్కుర్తి బుచ్చిరెడ్డిపాళెంలో బయటపడింది. వినియోగదారులకు అందజేసే ఫుల్ సిలిండర్‌లోని గ్యాస్ ఖాళీ సిలిండర్‌లోకి నింపుతూ స్థానికులకు అడ్డంగా దొరికిపోయారు. గురువారం మండలంలోని జొన్నవాడలో బైపాస్ రోడ్డు నుంచి తూర్పు వైపు పొలాల్లోకి వెళ్ళే డొంకలో హెచ్‌పీ గ్యాస్ సిలిండర్ల డెలివరీ వాహనం ఆగింది. అందులో ఫుల్ సిలిండర్‌లోని గ్యాస్‌ను ఖాళీ సిలిండర్‌లోకి నింపుతున్న కృష్ణ అనే డెలివరీ అసిస్టెంట్‌ను స్థానిక రైతులు, యువకులు అడ్డుకున్నారు. పోలీసులకు పట్టిస్తామనే సరికి బతిమలాడటం ప్రారంభించాడు. తనది నెల్లూరులోని పద్మావతి సెంటర్ (నిప్పో ఫ్యాక్టరీ వెనుక)లోని హెచ్‌పీ వంట గ్యాస్ లక్ష్మి ఏజెన్సీగా చెప్పి వదిలేయమని ప్రాధేయపడ్డాడు. ససేమీరా (మిగతా 4లో)



అమరజీవి ఆశయాలు
కొనసాగిస్తాం

- మంత్రి నారాయణ

ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని నెల్లూరులో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అమరజీవి పొట్టిశ్రీరాములు విగ్రహానికి రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆర్యవైశ్య సంఘం నాయకులు నివాళులర్పించారు. పొట్టిశ్రీరాములు ఆత్మబలిదానంతో భాషాప్రయోక్త రాష్ట్రా లు ఏర్పడి తెలుగువారికి గుర్తింపు లభించిందని, ఆ మహనీయుని ఆశయాలు కొనసాగిస్తామని మంత్రి నారాయణ తెలిపారు.

94.01 శాతం
పింఛన్ల పంపిణీ

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ శుక్రవారం పెద్ద ఎత్తున జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ, కలెక్టర్ ఆనంద్, అధికారులు పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. జిల్లాలో 3,08,759 మంది పింఛనుదారులు ఉండగా ఒక్కరోజే 94.01 శాతం మందికి పంపిణీ చేశారు.

22 మండలాల్లో
ధాన్యం సేకరణ కేంద్రాలు

నెల్లూరు(హరనాథపురం), నవంబరు1 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల ముగిసిన ఖరీఫ్ పంట కాలానికి సంబంధించి ధాన్యం కొనుగోళ్ల కోసం జిల్లాలో 22 మండలాల్లో 30 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ ఎల్ లక్ష్మీనరసింహారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఖరీఫ్ పంట కాలంలో జిల్లాలో మొత్తం 37,978 ఎకరాల్లో 1,29,583 టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని వ్యవసాయశాఖ వారు నివేదిక ఇచ్చారన్నారు. ఇందుకోసం ధాన్యం సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం ఆ పంటకు కనీస మద్దతు ధర గ్రేడ్-ఏ రకానికి క్వింటాలుకు రూ.2320గా, సాధారణ రకానికి క్వింటాలుకు రూ.2300గా నిర్ణయించిందని తెలిపారు. ధాన్యం మద్దతు ధర, కొనుగోళ్లపై ఫిర్యాదుల కోసం తమ కార్యాలయంలో 8520879979 టోల్ ఫ్రీ నంబరు ఏర్పాటు చేశామన్నారు. వివరాలకు ఆ నెంబరును సంప్రదించాలని కోరారు.

కందుకూరులో కలకలం

- ఏఎంసీ మాజీ చైర్మన్‌పై ప్రత్యర్థుల దాడి
- టీడీపీలోని మరోవర్గం దాడి చేయడంతో సంచలనం
- ఆనందపురంలో ఉద్రిక్తత


కందుకూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కందుకూరు మున్సిపాలిటీ పరిధిలోని ఆనందపురం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, ఏఎంసీ మాజీ చైర్మన్ తల్లపనేని వెంకటేశ్వర్లుపై ఆయన ప్రత్యర్థులు దాడి చేశా రు. గ్రామంలోని ఎస్టీ కాలనీలో మంచినీటి పైప్‌లైను నిర్మాణ పనులను గురువారం రాత్రి ఎనిమిదిన్నర గంటల ప్రాంతంలో వెంకటేశ్వర్లు పరిశీలించి ఇంటికి వస్తుండగా మార్గమధ్యంలో పార్టీలోని ప్రత్యర్థి వర్గీయులు ఆయనపై దాడిచేసి తీవ్రంగా కొట్టారు. నలుగురు వ్యక్తులు దాడి చేసినట్టు సమాచారం. టీడీపీ ఆవిర్భావం నుంచి ఉన్న వెంకటేశ్వర్లు 2015 నుంచి 2019 వరకు కందుకూరు ఏఎంసీ చైర్మన్‌గా రెండు సార్లు పని చేశారు. మాజీ ఎమ్మెల్యే దివి శివరాం ముఖ్య అనుచరుడిగా గుర్తింపు పొందిన వెంకటేశ్వర్లు 2019 ఎన్నికల్లో శివరాం కు టిక్కెట్ ఇవ్వలేదన్న కారణంతో వైసీపీ అభ్యర్థి మహీధరరెడ్డికి మద్దతుగా పనిచేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ గూటికి చేరి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు విజయం కోసం పనిచేశారు. ఆనందపురంలో టీడీపీలోనే మరో వర్గానికి నాయకత్వం వహిస్తున్న తల్లపనేని రవి, ఆయన సోదరుడు, మరో ఇద్దరు పథకం ప్రకారం తనపై దాడిచేశారని వెంకటేశ్వర్లు తెలిపారు. అనంతరం పోలీసులు వచ్చి గ్రామంలో బందోబస్తు ఏర్పాటు చేశారని తెలిపారు. రాజకీయదాడుల ఘటనలు కొన్నేళ్లుగా నియోజకవర్గంలో లేవని ఇటువంటి సంస్కృతి బలపడితే ప్రమాదకరమని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తుండటం విశేషం.



విద్యుత్ సరఫరా చేసి, సాగుకు సహకరించండి!

నిరంతరం విద్యుత్ సరఫరా చేసి, పంటల సాగుకు సహకరించాలని కోరుతూ కావలిలోని విద్యుత్ డీఈ కార్యాలయం వద్ద శుక్రవారం జలదంకి మండలం గట్టుపల్లి చింతలపాలెం రైతులు ఆందోళన చేశారు. అనంతరం డీఈ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గట్టుపల్లి చింతల పాలెం ఫీడర్‌కు జేఎల్‌ఎం లేనం దున విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం ఏర్ప డుతోందన్నారు. నీరందక సాగు చేసుకోవాలన్నా, నారుమడులు పోసుకోవా లన్నా ఇబ్బందిగా మారిం దన్నారు. జేఎల్‌ఎంను నియమించి పంటలు పండించుకు నేందుకు సహకరించాలని ఏఈని, డీఈని అనేకమార్లు కోరినా పట్టించు కోలేదని వాపోయారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ డీఈకి లేఖ అందించినా అధికారుల్లో స్పందన లేనందునే ఈ ఆందోళన చేపట్టినట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

- కావలి టౌన్ (ఆంధ్రజ్యోతి)



ఓ టీచరు మంచి మనసు

● టెన్త్ విద్యార్థులకు ఫీజు చెల్లింపు

పిల్లలకు విద్యాబుద్ధులే కాదు.. వారికి ఆర్థిక తోడ్పాటు అందించే గురువులు చాలా అరుదుగా ఉంటారు. అలాంటి అరుదైన ఉపాధ్యాయుల్లో ఒకరిగా నిలిచారు. చల్లా చంద్రశేఖరరెడ్డి, అనంతసాగరం మండలం చిలకలమర్రి ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి పదో తరగతికి చెందిన 22 మంది విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల



ఫీజు మొత్తం రూ.2,750 నగదును హెచ్‌ఎంకు అందజేశారు. అందరూ పేద విద్యార్థులు కావడంతో తన వంతుగా సాయంగా ఫీజు రుసుం అందజేసినట్లు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన్ను తోటి ఉపాధ్యాయులు, సిబ్బంది, స్థానికులు అభినందించారు.

- అనంతసాగరం (ఆంధ్రజ్యోతి)

కార్తీకం.. ముక్తి దాయకం!

● ఆధ్యాత్మిక కార్యక్రమాలతో చక్కని ఆరోగ్యం
● ఉపవాసాలు, శాకాహార భోజనంతో చక్కని ఫలితాలు
● నేటి నుంచి కార్తీక మాసం

ఆత్మకూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం శనివారం ప్రారంభం కానుండగా, ఈ మాసంలో నాలుగు సోమవారాలు (4, 11, 18, 25 తేదీలు) వస్తాయి. అదే క్రమంలో ఈ నెల 5న నాగులచవితి, 6న నాగులపంచమి, 9న కోటి సోమవారం, 15న కార్తీక పౌర్ణమి వస్తాయి. శివ భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో ఈ మాసంలో పరమేశ్వరుడిని ఆరాధిస్తారు. ఏ ఇల్లు చూసినా ధూపదీపాలతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుని కనిపి స్తుంది. కార్తీకమాసంలో పట్టణాలు మొదలు పల్లెల్లోని ఆలయాల్లో భక్తుల సందడి నెలకుం టుంది. కార్తీక మాసంలోనే ఎక్కువగా ప్రజలు ఏటా అయ్యప్ప దీక్ష మాలను ధరిస్తారు.

● ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ

కార్తీక మాసం ప్రారంభంతో జిల్లాల్లోని ప్రముఖ శైవాలయాలు ఆధ్యాత్మికశోభను సంతరించుకున్నాయి. నెల్లూరులోని మూలస్థానేశ్వరుడు, రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయాలతోపాటు జొన్నవాడలోని కామాక్షితాయి, సంగంలోని కామాక్షిదేవి సమేత సంగమేశ్వరస్వామి, విడవలూరు మండలం రామతీర్థంలోని రామలింగేశ్వరుడు, ఇందుకూరుపేట మండలం మైపాడు తీరంలోని శివాలయాల్లో కార్తీకమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు, పలు కార్యక్రమాలు జరగనున్నాయి.

● చక్కని ఆరోగ్యం

కార్తీక మాసంలో సూర్యోదయానికి ముందు చన్నీటి స్నానం ఎంతో ఆరోగ్యదాయకం. చల్లని నీటిలో అధిక ఉష్ణం ఉండటం వలన వివిధ రకాల అంటురోగాలు దూరమవుతాయని వైద్యనిపుణులు చెబుతున్నారు. ప్రాతఃకాలంలో చన్నీటి స్నానాలు ఆచరించడం, ఇంటి ముంగిళ్లలో ఆవుపేడను కలిపిన నీటిని చల్లడంతోపాటు బియ్యపు పిండితో ముగ్గులు వేస్తారు. ఇంటి ద్వారాలకు పసుపు కుంకుమను పూయడంతో తెలుగుదనం ఉట్టిపడడంతో పాటు యాంటిబయాటిక్‌గా ఉపయోగపడి క్రిమికీటకాలు ఇంటిలోకి రానివ్వకుండా ఉపకరిస్తాయి.

● దీప దానం ముఖ్యం



సంగంలోని కామాక్షిదేవి సంగమేశ్వరాలయం

కార్తీకంలో చేయాల్సిన మొట్టమొదటి పనుల్లో ఉండేది దీప దానం అని పెద్దలు చెబుతుంటారు. అలాగే తులసి కోట దగ్గర తప్పనిసరిగా ఉదయం, సాయంత్రం దీపం వెలిగించాలి. ఈ మాసంలో చేసే దీపారాధనకు విషేషమైన ప్రాముఖ్యత ఉంటుంది. ఎవరైనా తెలిసీ తెలియక చేసిన పాపాలు దీపదానం చేయడం వల్ల తొలగి పోతాయని భక్తులు విశ్వసిస్తారు. ఇంటి ముందు వెలిగించే దీపాలు ఎంతో ఆహ్లాదాన్ని నింపుతాయి. దీపాలకు వినియోగించే నెయి, నువ్వులనూనె నుంచి వచ్చే వాసనకు ఇంట్లోకి క్రిమికీటకాలు రాకుండా నివారించబడతాయి. ఈ వాసనలు మనం పీల్చడం ద్వారా ఉదర సంబంధిత వ్యాధులు వారికి కొంత ఉపశమనం లభించే అవకాశాలు ఉన్నాయి.

● ఉపవాసాలు, శాకాహార భోజనం

కార్తీకమాసంలో ఉపవాసాలు, శాకాహార భోజనంతో చక్కని ఫలితాలు కలుగుతాయి. ఉపవాసాల కారణంగా వివిధ రకాల రుగ్మతలను నివారించుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు. ఉల్లిపాయలు, గుమ్మడి, పసుపు, ఉప్పు, కారం ఈ మాసంలో నిషేధితాలుగా చెప్పబడుతున్నాయి. తద్వారా ఆరోగ్య సమస్యలకు కొంత మేరకు ఉపశమనం లభిస్తుందని వైద్యశాస్త్రాలు చెబుతున్నాయి. ఉపవాసంతో శరీరంలోని కొవ్వును తగ్గించుకునే అవకాశాలు ఉన్నాయి. మధుమేహ వ్యాధిగ్రస్తులు మాత్రం ఉపవాసాలకు దూరంగా ఉండటమే మంచిది.



నెల్లూరు : విద్యుద్దీప వెలుగుల్లో మూలస్థానేశ్వరుడి ఆలయం

● వన భోజనాలు

ఈ మాసంలో పట్టణాల్లో, పల్లెల్లో ఏర్పాటు చేసే సహపంక్తి భోజనాలు ప్రజల్లో సమైఖ్యతను పెంపొందిస్తాయనడంలో సందేహం లేదు. ఈ మాసంలో వనభోజనాలు ఏర్పాటు చేయడం ఆనవాయితీ. గ్రామాల్లోని చిన్నాపెద్ద ఒక చోట చేరి కలసి భోజనం చేయడం ఎంతో సంతో షాన్ని కలిగిస్తుంది. వాటికితోడు దైవ కార్యక్రమాల్లో పాల్గొనడంతో తమలో ఉన్న ద్వేషభావాలు తొలిగిపోయి స్నేహభావంతో మసులుకొనే అవకాశాలున్నాయి.

● **భగినీ హస్త భోజనం (అన్నా చెల్లెళ్ల పండుగ) :** ఈ నెల 3వ తేదీన భగినీ హస్త భోజనం (అన్నా చెల్లెళ్ల పండుగ) వస్తుంది. ఈ రోజున సోదరులు తమ సోదరీమణుల ఇంటికి వెళ్లి భోజనం చేసి వారిని ఆశీర్వదించి తగిన బహుమతి ఇచ్చివచ్చినట్లయితే సోదరులకు ఏమైన యమగండాలు ఉంటే తొలిగిపోతాయని పురాణాలు చెబుతున్నాయి. అంతే కాదు అన్నాతమ్ముళ్లు, అక్కా చెల్లెళ్ల మధ్య అనుబంధం బలపడుతుంది.

● **కోటి సోమవారం :** ఈ నెల 9వ తేదీన కోటి సోమవారం వస్తుంది. ఇదే రోజు గోపాష్టమి (గోపూజ) పర్వదినంగా కూడా పరిగణిస్తారు.

● **కార్తీక పౌర్ణమి :** 15వ తేదీన శుక్రవారం కార్తీక పౌర్ణమి. ఆ రోజున పరమశివుడికి ప్రీతిపాత్రమైన జ్వాలాతోరణ ఉత్సవం జరుగుతుంది.

కార్తీక మాసంలో ముఖ్యమైన రోజులు

తేదీ	వారం	ప్రత్యేకత
2	శనివారం	కార్తీకమాసం ప్రారంభం
3	ఆదివారం	భగినీ హస్త భోజనం
4	సోమవారం	మొదటి కార్తీక సోమవారం
5	మంగళవారం	నాగుల చవితి
6	బుధవారం	నాగుల పంచమి
9	శనివారం	కోటి సోమవారం
11	సోమవారం	2వ కార్తీక సోమవారం
15	శుక్రవారం	కార్తీక పౌర్ణమి
18	సోమవారం	3వ కార్తీక సోమవారం
25	సోమవారం	4వ కార్తీక సోమవారం
26	మంగళవారం	సర్వ ఏకాదశి

ఇటు పర్యాటకం.. అటు ఆధ్యాత్మికం

● భైరవుని రూపాంతరమే భైరవకోన ● శైవక్షేత్రం ఘుటిక సిద్ధేశ్వరం

ఉదయగిరి రూరల్/సీతారామపురం (ఆంధ్రజ్యోతి) : భక్తులను, పర్యాటకులను ఆనంద పరవశానముంచే వెలుగొండ అడవుల్లో కొలువైన శైవక్షేత్రాలు భైరవకోన, ఘటిక సిద్ధేశ్వరం. ఓ వైపు భక్తులు.. మరోవైపు పర్యాటకుల మదిని దోచే ప్రకృతి రమణీయ దృశ్యాలు.. ఎత్తయిన కొండలు.. దుమికే జలపాతాలు.. పారే సెలయేళ్లు.. పక్షుల కిలకిలరావాలు.. ఎటుచూసినా పచ్చదనం.. భక్తులను తన్మయాన అలరారించే శివలింగాలు.. ఏడాది పొడవునా నందినోట జాలువారే నీరు.. పరమశివునికి అత్యంత ప్రీతిపాత్రమైన బిల్వపత్రాలు.. నిత్యం శివనామస్మరణతో ఈ క్షేత్రాలు మారుమోగుతాయి. కడప, ప్రకాశం, నెల్లూరు జిల్లాల సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న ఈ ప్రాంతానికి భక్తులు తరలి వస్తుంటారు.

● కోటిలింగాలకోన, భైరవకోన: మూడు పర్వతాలకు మధ్యనున్న ఈ ప్రాంతంలో ఎంతో ప్రశాంతంగా ప్రకృతి అందాలతో రమణీయంగా ఉంటుంది. బ్రహ్మ, రుద్ర, విష్ణు పర్వతాలుగా ఆ మూడు కొండలను పిలుస్తారు. వాటి నడుమున్న భైరవకోనకు క్షేత్రపాలకుడిగా బాలభైరవుడని చెబుతారు. భైరవుడు బాలుడు కావడంతో దుర్గాదేవి అక్కడికి వచ్చిందని, భార్గవముని తపస్సు మూలంగా శివుడు భర్గేశ్వరుడిగా వెలిశాడని చెపుతారు. భైరవ, దుర్గ, భర్గులకు 128 ఆలయాలు నిర్మించారని, కోటి లింగాలను అక్కడ ప్రతిష్ఠించారని చారిత్రక కథనం. ఈ ప్రాంతాన్ని పూర్వం ధర్మారణ్యం అని పిలిచేవారని అంటారు. అప్పట్లో వెలిసిన 128 ఆలయాలు కాలగర్భంలో కలిసినా ఏకశిలలో తొలిచిన గుహలో ఉన్న అష్టలింగాల ఆలయాలు నేడు దర్శినిమిస్తాయి. శశినాగలింగం, రుద్రలింగం, నగరికేశ్వరలింగం, విశ్వేశ్వరలింగం, భర్గేశ్వరలింగం, రామేశ్వరలింగం, మల్లికార్జునలింగం, భైరవలింగం అనే ఈ అష్టలింగాలను భక్తులు దర్శనం చేసుకుంటారు.



భైరవకోనలో కనువిందు చేస్తున్న సొనవాన జలపాతం

● **శైవక్షేత్రం ఘుటికసిద్ధేశ్వరం :** ఈ క్షేత్రం అత్యంత ప్రాచీనమైంది. దక్షిణ కాశిగా పిలవబడుతోంది. త్రేతాయుగంలో అగస్త్యముని తపస్సు చేస్తుంటే ఘుటిక మింగేలోపు స్వామి, అమ్మవారు ప్రత్యక్షమవుతారు. అందువల్ల స్వామివారిని ఘుటికసిద్ధేశ్వరస్వామిగా, అమ్మవారిని సిద్ధేశ్వరదేవిగా పిలవబడతారు. ఘుటికసిద్ధేశ్వరంలో శివునికి అత్యంత ఇష్టమైన బిల్వపత్రాలు, నాగలింగ పుష్పాలు ఉన్నాయి. ఈ పత్రాలు, పువ్వులతో భక్తులు స్వామివారికి పూజలు నిర్వహిస్తుంటారు. ఘటికసిద్ధేశ్వర్యంలో ప్రతిరోజు రాత్రి సమయాల్లో శివుని విగ్రహం చుట్టూ ఓ సర్పం ప్రదక్షణ చేస్తుంటుందని చరిత్ర చెబుతోంది. క్షేత్రంలో ఏడాది పొడవునా నందినోట జలధార వస్తుండడం, ఏకశిల ధ్వజస్తంభం ప్రతిష్ఠించి ఉండడం మరో విశేషం. దీనికిడోడు ఘుటికసిద్ధేశ్వరంలో ఉన్న నిత్యాన్నదాన సత్రాన్ని దాతల సహకారంతో 1971లో ఏర్పాటు చేశారు. సద్గురు కాశినాయన నిత్యాన్నదాన క్షేత్రంలో భక్తులు ఏ సమయంలో వెళ్లినా భోజనం వడ్డిస్తారు.



సీతారామపురం : ఒకే రాతిలో మలిచిన అష్టలింగాలయాల వద్ద భక్తులు

సిలిండర్లలో చేతివాటం!

(3వ పేజీ తరువాయి)

అన్న స్థానికులు ఏజెన్సీ మనోజ్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే అక్కడకు చేరుకున్న మనోజ్‌ను నిలదీశారు. గ్యాస్ డౌన్‌లోడు చేసిన రాడ్‌ను చూసి ఫిర్యాదు చేశాడు. తప్పుచేసిన డెలివరీ అసిస్టెంట్‌ను విధుల్లో నుంచి తొలగిస్తామని తెలిపారు. స్థానికులు శాంతించడంతో వాహనాన్ని తీసుకెళ్లారు.

● **గ్యాస్ మోసం వెలుగులోకి..**

గ్యాస్ సిలిండర్లలో ఏజెన్సీ నిర్వాహకులు, డెలివరీ బాయ్స్ చేతివాటంతో వినియోగదారులు మోసపోతున్నారు. నెలరోజులకుపైగా రావాల్సిన సిలిండర్‌లోని గ్యాస్ 15, 20 రోజులకో వస్తుండటంతో స్టౌ బాగోలేదనే వేరే కారణాలు చెప్పి తప్పించుకుంటున్నారు. అయితే, జొన్నవాడలో జరిగిన ఘటనను పరిశీలిస్తే వారి మోసం బట్టబయలు అయింది. నిత్యం ఇలా జరుగుతన్నా పౌరసరఫరాల శాఖ అధికారులు మిన్నకుండిపోవడంపై విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్యాస్ వినియోగదారులు కోరుతున్నారు.

అట్టహాసంగా దీపం-2

(3వ పేజీ తరువాయి)

ఫోన్ చేసి వివరాలు అడగవచ్చు. పిర్యాదు కూడా చేయవచ్చు. ఉచిత సిలిండర్ల కోసం ఏవిధమైన దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు. సాధారణ బుకింగ్ మాదిరిగానే ఉచిత సిలిండర్ కోసం బుక్ చేయవచ్చు. క్రియాశీలకంగా ఉన్న ఎల్‌పీజీ కనెక్షన్లు, ఆధార్ నంబరు అనుసంధానం, తెల్లరేషన్ కార్డు, ఇతర శాఖ డేటాబేస్‌తో సరిపోలిన ఎల్‌పీజీ కనెక్షన్ ఉన్నవారికి ఈ పథకం వర్తిస్తుంది. అర్హులైన లబ్ధిదారులకు ఫోన్‌లో మెసేజ్ ద్వారా సమాచారం అందిస్తున్నారు.

● **పండుగలా ప్రారంభం**

నెల్లూరులోని బంగ్లాతోట ప్రాంతంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఉచిత సిలిండర్ల పంపిణీని జెండా ఊపి ప్రారంభించారు. లబ్ధిదారులకు సిలిండర్లను అందజేశారు. కలెక్టర్ ఆనంద్, కమిషనర్ సూర్యతేజ, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, సివిల్ సప్లయిస్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఆత్మకూరులో రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి లబ్ధిదారులకు సిలిండర్లను అందజేశారు. మనుబోలులో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోవూరులో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, నెల్లూరు రూరల్‌లో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మహిళలకు ఉచిత సిలిండర్లను పంపిణీ చేశారు.

'ఆంధ్రజ్యోతి'కి నటి వాణిశ్రీ అభినందనలు

నెల్లూరు రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : తాను చేసిన ఆర్థిక సాయంతో నెల్లూరు రూరల్ మండలం సౌత్‌మోపూరులో నిర్మించిన జడ్పీ హైస్కూల్‌లో చదువుకున్న ఎంతో మంది ఉద్యోగులుగా ఎదగడంపై సినీ నటి వాణిశ్రీ హర్షం వ్యక్తం చేశారు. 'ఉద్యోగుల ఊరు సౌత్‌మోపూరు' శీర్షికతో ఇటీవల ఆంధ్రజ్యోతి దిన పత్రిక ప్రచురించిన ప్రత్యేక కథనంపై ఆమె స్పందించారు. శుక్రవారం ఆంధ్రజ్యోతి ప్రతినిధికి ఫోన్ చేసి సంతోషాన్ని వ్యక్తం చేశారు. తన దాతృత్వం వల్ల ఒక ఊరిలో ఇంతమంది ఉద్యోగులు కావడం గర్వంగా ఉందన్నారు. చుట్టుపక్కల 11 గ్రామాల్లో ఎక్కడా లేనంతగా సౌత్‌మోపూరులోనే ఇంతమంది ఉద్యోగులుగా స్థిరపడటానికి వాణిశ్రీ జడ్పీ హైస్కూల్ కారణం కావడం తన జీవితంలో మరువలేనిదని తెలిపారు. ఇలాంటి స్ఫూర్తిదాయకమైన కథనాన్ని వెలుగులోకి తెచ్చినందుకు 'ఆంధ్రజ్యోతి' అభినందనలు తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళకు తీవ్రగాయాలు

● చిన్నారికి తప్పిన ప్రమాదం

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు1(ఆంధ్రజ్యోతి): పసిబిడ్డను చంకన వేసుకుని రోడ్డు దాటుతున్న ఓ గిరిజన మహిళను పామూరు నుంచి నెల్లూరుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు బుచ్చిరెడ్డిపాళెంలోని రాఘవరెడ్డి కాలనీవద్ద ఢీకొంది. దీంతో ఆ మహిళకు తీవ్రగాయాలయ్యాయి. చంకలోని సుమారు 2ఏళ్ల పసిబిడ్డ రోడ్డు పక్కన పడిపోయినా ప్రమాదం తప్పింది. బాధిత మహిళను చికిత్స నిమిత్తం 108లో బుచ్చి ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ వైద్యులు ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళ

ప్రయాణికుడిపై ట్రావెల్స్ బస్ డ్రైవర్ దాడి

● డ్రైవర్‌ను చుట్టుముట్టిన బాధితుడి బంధువులు
● పోలీసుల జోక్యంతో సర్దుమణిగిన వివాదం



బస్సు వద్ద గుమిగూడిన బాధితుడి బంధువులు, ప్రయాణికులు



గాయాలతో బాధితుడు లాజర్

కావలిరూరల్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): ఓ ప్రయాణికుడిపై హైదరాబాద్ వెళ్తున్న చెర్రీ ట్రావెల్స్ బస్ డ్రైవర్ దాడి చేసిన ఘటన శుక్రవారం రాత్రి కావలి ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా జరిగింది. బాధితుడు వివరాల మేరకు.. పట్టణంలోని అరుంధతీయ వాడకు చెందిన మన్నేపల్లి లాజర్ హైదరాబాద్ వెళ్లేందుకు చెర్రీ ట్రావెల్స్ బస్‌లో టికెట్ బుక్ చేసుకున్నాడు. ఆయన కావలిలో బస్ ఎక్కబోగా లాజర్ మద్యం సేవించి ఉన్నందున బస్ ఎక్కవద్దని ట్రావెల్ బస్ డ్రైవర్ కొండేటి శ్రీకాంత్ వారించాడు. దీంతో తన టికెట్ నగదు తనకు ఇవ్వాలని లాజర్ అడగడంతో డ్రైవర్ శ్రీకాంత్ కాలితో తన్ని దాడి చేశాడు. దీంతో ప్రయాణికుడికి పన్ను విరిగి గాయాల య్యాయి. ఈ ఘటనతో బాధితుడు రోడ్డుపై బైఠాయించాడు. విషయం తెలుసుకున్న బాధితుడి బంధువులు అక్కడకు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న 1వ పట్టణ ఎస్ఐ సుమన్ అక్కడకు చేరుకుని ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా జనాలను చెదరగొట్టి బాధితుడిని చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలకు పంపి డ్రైవర్ శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకుని రెండవ పట్టణ పోలీసులకు అప్పగించడంతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి రాష్ట్ర యోగా పోటీలు

● పకడ్బందీ ఏర్పాటు చేయాలి : డీఈవో

నెల్లూరు(విద్య), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో 68వ రాష్ట్రస్థాయి అండర్-14, 17 బాల, బాలికల యోగా పోటీల నిర్వహణకు సర్వం సిద్ధం చేసినట్లు ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు తెలిపారు. నెల్లూరులోని దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శని, ఆదివారాల్లో జరిగే ఈ పోటీలకు రాష్ట్రంలోని పాత జిల్లాల ప్రాతిపదికన 13 జిల్లాల నుంచి 400 మంది క్రీడాకారులు హాజరవుతున్నారు. వీరికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా బాలుర పాఠశాలలో బాలురకు, బాలికల పాఠశాలలో బాలికలకు వసతి, భోజన సదుపాయాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాల ఆవరణలో జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి ఆర్ బాలాజీరావు మాట్లాడుతూ రాష్ట్ర పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు, ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బం దులు లేకుండా పకడ్బందీగా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పోటీల నిర్వహణకు సంబంధించిన పలు అంశాలపై ఎస్‌జీఎఫ్ సిబ్బంది, వ్యాయామ ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. పోటీల ప్రారంభో త్సవానికి మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ, కలెక్టర్ ఆనంద్, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఇతర ప్రజా ప్రతినిధు లు, అధికారులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఎన్ విజయ, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం నేతలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి కళ్యాణం

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని బాలాజీనగర్ సీతారామ మందిరంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆల యంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. వికాస్ ప్రజాహిత సేవా సమితి ఆధ్వర్యంలో సమితి వ్యవస్థాపకు డు కర్తం ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పాల్గొన్న భక్తు ల్లో ఐదుగురిని లాటరీ ద్వారా ఎంపిక చేసి వస్త్రాలు అందజేశారు. కార్పొరేటర్ వేనాటి శ్రీకాంత్‌రెడ్డి, కిషోర్, అమరా మోహన్‌రావు, రత్నం, తన్నీరు మస్తాన్ రావు, ఎంపీ ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని తల్లీకూతుళ్ల మృతి



గర్నెపూడి శిరీష (ఫైల్)

కావలి రూరల్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని తల్లీ కూతురు మృతి చెందిన ఘటన కావలి రైల్వే స్టేషన్‌లో జరిగింది. జీఆర్పీ పోలీసుల కథనం మేరకు.. బాపట్ల జిల్లా అల్లూరుకు చెందిన నత్తల వజ్రమ్మ(60) కావలి పట్టణంలోని బర్మాషల్ వీధిలో నివాసం ఉంటున్న కుమార్తె గర్నెపూడి శిరీష(35) వద్దకు వచ్చింది. తిరిగి స్వగ్రామానికి వెళ్లేందుకు గురువారం తెల్లవారు జామున బయలుదేరింది. దీంతో బిట్రగుంట నుంచి విజయవాడ వెళ్లే ప్యాసింజర్ రైలు తల్లి నత్తల వజ్రమ్మను తీసుకుని స్వగ్రామంలో వదిలి వచ్చేందుకు తల్లితోపాటు కుమార్తె రైల్వే స్టేషన్‌కు వెళ్లారు. అయితే ఒంగోలు వైపు వెళ్లే రైళ్ల 3వ నెంబరు ప్లాట్‌ఫాం మీదకు వస్తుండటంతో తల్లీ కూతురు 3వ నెంబరు ప్లాట్‌ఫాంపై ఆగారు. అయితే బిట్రగుంట నుంచి విజయవాడ వెళ్లే ప్యాసింజర్ రైలు 1వ నెంబరు ప్లాట్‌ఫాం పైకి వస్తున్నట్లు రైల్వే అధికారులు అనవున్స్‌మెంట్ చేయడంతో వారిద్దరు 3వ నెంబరు ప్లాట్‌ఫాం నుంచి 1వ నెంబరు ప్లాట్‌ఫాం పైకి వచ్చేందుకు పట్టాలపై దిగారు. కుమార్తె శిరీష ముందుగా 2వ నెంబరు ప్లాట్‌ఫాంపైకి ఎక్కింది. ఆమె తల్లి వజ్రమ్మ ఎక్కలేకపోగా అదే సమయంలో ఆ పట్టాలపై రైలు వస్తుండడంతో తల్లిని కాపాడేందుకు ప్లాట్‌ఫాం దిగి ఆమెను పైకి ఎక్కించే క్రమంలో కొయంబత్తూరు ఎక్స్‌ప్రెస్ వేగంగా వచ్చి వారిని ఢీకొంది. దీంతో ఇరువురి మృతదేహాలు పట్టాలపై చల్లాచెదరుగా పడ్డాయి. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెట్టు మీదపడి మహిళ మృతి



సంఘటన స్థలంలో విచారిస్తున్న ఎస్ఐ రాజేష్

సంగం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిపాడు గ్రామం ఎస్సీ కాలనీలో జామాయిల్ చెట్టు మీదపడి కాలనీకి చెందిన ఈగ చెంచమ్మ (58) అనే మహిళ మృతిచెందిన సంఘటన శుక్రవారం జరిగింది. వివరాల మేర కు కాలనీలో ప్రసన్న కుమార్ అనే వ్యక్తి ఇంట్లో ఉన్న జామాయిల్ చెట్టును ఓ వ్యాపారస్థుడికి విక్రయించాడు. దీంతో కొనుగోలు చేసిన వ్యక్తి చెట్టును కూలీలచే కొట్టించుచుండగా ఒక్కసారిగా చెట్టు పక్క ఇంటి ఆవరణలో ఉన్న చెంచమ్మపై పడింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సమా చారం అందుకున్న ఎస్ఐ రాజేష్ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. పోస్టుమర్టం నిమిత్తం మృతదేహాన్ని ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మనస్థాపంతో యువకుడి ఆత్మహత్య

ఉదయగిరి రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి పట్ట ణంలోని యాదవ వీధిలో ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మ హత్య చేసుకున్న సంఘటన శుక్రవారం చోటు చేసుకొంది. పోలీ సులు తెలిపిన వివరాల మేరకు.. పల్లపు రామయ్య(31) తన తల్లి జయమ్మతో కలిసి గత కొంత కాలంగా యాదవవీధిలో నివాస ముంటున్నాడు. ఏ పని చేయకుండా ప్రతినిత్యం తల్లిని డబ్బుల కోసం వేధించే వాడు. దీంతో తల్లి రామయ్యను మందలిస్తుండేది. ఈనేపథ్యంలో జయమ్మ గురువారం సామాజిక పింఛన్ తీసుకునేందుకు స్వగ్రామమైన మండలంలోని యర్రబల్లిగడ్డ బీసీ కాలనీకి వెళ్ళింది. ఈ తరుణంలో మనస్థాపం చెందిన రామయ్య ఇంట్లో ఉన్న దూలానికి చీరతో ఉరి వేసుకున్నాడు. శుక్రవారం ఉదయం ఇంటికొచ్చిన తల్లి జయమ్మ రామయ్య ఉరి వేసుకొని ఉండడాన్ని గుర్తించి స్థానికుల సహాయంతో పోలీసులకు సమాచారం అందిం చింది. వారు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. ఈమేరకు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

బంగారంతో ఉడాయించిన వ్యక్తిపై కేసు

నెల్లూరు(క్రైం), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆభరణాలు తయారు చేసేందుకు ఇచ్చిన బంగారంతో ఉడాయించిన వ్యక్తిపై చిన్నబజారు పోలీసు లు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని ద్రోణంరాజువీధికి చెందిన డీ గురు కమల్ అదే ప్రాంతంలో బంగారం దుకాణం నిర్వహిస్తున్నాడు. వినియోగదారుల నుంచి బంగారు ఆభరణాల ఆర్డర్స్ తీసుకొని కామాటివీధిలోని ప్రసణ్య మాండల్‌కు బంగారం ఇచ్చి ఆభరణాలు తయారుచేయించేవాడు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ఆగస్టు 2వ తేదీన గురు కమల్ 170 గ్రాముల బంగారాన్ని ఆభరణాల తయారీ కోసం ప్రసణ్య మాండల్‌కు ఇచ్చాడు. ఆ బంగారం తీసుకుని అతను కుటుం బంతో సహా ఊరు వదిలి వెళ్లిపోయాడు. ఈ మేరకు బాధితుడు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ మెకానిక్ అదృశ్యంపై ఫిర్యాదు

నెల్లూరు(క్రైం), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): బైక్ మెకానిక్ ఒకరు అదృశ్యమైన ఘటనపై నవాబుపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని జాకీర్‌హుస్సేన్ నగర్‌లో షేక్ అహ్మద్‌బాషా, సల్మా దంపతులు నివసిస్తున్నారు. అహ్మద్ బైక్ మెకానిక్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆయన చెడు వ్యసనాలకు బానిసవడంతో గత నెల 24వ తేదీన దంపతుల నడుమ వాగ్వాదం జరిగింది. అదే రోజు ఇంటి నుంచి బయటకు వెళ్లిన అహ్మద్ తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు అతని కోసం ఎంత గాలించినా ఫలితం లేకపోవడంతో గురువారం నవాబుపేట స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మోటారు బైక్ - టాటా ఏస్ వాహనం ఢీ

- ఇద్దరు యువకులకు గాయాలు

సంగం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ముందు వెళ్తున్న మోటారుబైక్‌ను వెనుక నుంచి టాటా ఏస్ వాహనం ఢీకొనడంతో మోటారు బైక్ నడుపుతున్న యువకుడితోపాటు టాటా ఏస్ వాహనంలో కూర్చొన్న యువకుడికి గాయాలైన సంఘటన స్థానిక ఎస్సీ హాస్టల్‌కు ఎదురుగా రహదారిపై శుక్రవారం జరిగింది. వివరాల మేరకు సంగం గ్రామానికి చెందిన వెంకట్ మోటారు బైక్‌పై సంగం టౌన్‌లోకి వస్తుండగా వెనుక వస్తున్న టాటా ఏస్ వాహనం మోటారు బైక్‌ను ఢీకొంది. దీంతో మోటారుబైక్ నడుపుతున్న వెంకట్, వాహనంలో డ్రైవర్ సీటు పక్కన కూర్చొన్న యువకుడు మనోహర్‌కు గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	137
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	244
స్కిన్‌లెస్	270
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7607
వెండి కిలో ధర	రూ. 97,600
వెండి ఒక గ్రాము	రూ.100.60

వ్యవసాయమే మన జీవనాధారం, రైతే దేశానికి వెన్నెముక... అంటూ అందరూ పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతుంటారు. కానీ ఆ రైతులు బలహీనులు కాబట్టి వారికి అన్యాయం చేసినా ఏమీ కాదులే.. అన్న ధోరణి క్షేత్రస్థాయిలో కనిపిస్తోంది. నెల్లూరు నగరంలోని సర్వేపల్లి కాలువ, కృష్ణ పట్నం కాలువల ఆక్రమణలే ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ.



పూడిక తీసే వాహనాలు వెళ్లే వీలులేకుండా సర్వేపల్లి కాలువ స్థలంలో నడుపుతున్న నర్సరీ



పూడిక పిచ్చి చెట్లతో నిండిన కృష్ణపట్నం కాలువ



కాలువ గట్టున నర్సరీ

- ఆక్రమణల సుడిలో కృష్ణపట్నం, సర్వేపల్లి కాలువలు
- దర్జాగా వ్యాపారం చేసుకుంటున్న ప్రైవేటు వ్యక్తులు
- కాలువల్లో పూడిక తీసేందుకూ వీల్లేని దుస్థితి
- కదలనంటున్న వ్యాపారులు.. పారనంటున్న సాగునీరు
- ఆయకట్టు రైతులకు ఇబ్బందులు.. ఆందోళనకు సిద్ధం

కాలువల కష్టాలు!

నెల్లూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సర్వేపల్లి, కృష్ణపట్నం కాలువల కింద దాదాపు 50 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. అయితే ఆ కాలువలు కొన్నేళ్లుగా క్రమేణా ఆక్రమణకు గురవుతూ వస్తున్నాయి. ఇప్పుడది పతాకస్థాయికి చేరుకుంది. కాలువ గట్టున రకరకాల వ్యాపార కేంద్రాలు, దుకాణాలు వెలిశాయి. కాలువల మనుగడే ప్రశ్నార్థకంగా మారేటంతలా ఈ ఆక్రమణలున్నాయి. కాలువల్లో పూడిక తీసేందుకు కూడా వీల్లేని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రస్తుత రబీ సీజన్‌కు నీరు విడుదల చేసినా ఆ రెండు ప్రధాన కాలువల ద్వారా నీటి పారుదల కష్టంగా మారింది. ఈ ప్రభావం ఆయకట్టు రైతులపై పడుతోంది. పూడికతీయాలంటూ రైతులంతా ఇరిగేషన్ కార్యాలయాలకు వచ్చి అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. అయితే ఆయా కాలువలను ఆక్రమించుకున్న ప్రైవేటు వ్యక్తులు మాత్రం ఇరిగేషన్ అధికా రుల హెచ్చరికలు లెక్క చేయడం లేదు. దర్జాగా వ్యాపారాలు చేసుకుంటు న్నారు. పైగా ఆక్రమణలు తొలగించవద్దంటూ ఇరిగేషన్ అధికారులపై వివిధ రాజకీయ పార్టీల నేతలు ఒత్తిడి చేస్తుండటం పరిస్థితి ఏ స్థాయికి దిగజారిపోయిందో తెలియజేస్తోంది. ఈ రాజకీయ నేతలకు రైతుల కన్నా ఆక్రమణదారులే ఎక్కువైపోయారు. ఈ నేపథ్యంలో రైతాంగమే ఆందోళనకు సిద్ధమవుతుండటం ఇరిగేషన్ అధికారులను కలవరపెడుతోంది.

ఆక్రమణలతో అన్నీ సమస్యలే

నెల్లూరు నగరంలో మినీ బైపాస్‌కు సమాంతరంగా సర్వేపల్లి కాలువ వెళుతుండగా, హరనాథపురం జంక్షన్ నుంచి కృష్ణపట్నం కాలువ ప్రారంభమవుతుంది. పెన్నా బ్రిడ్జి నుంచి రామలింగాపురం జంక్షన్ వరకు సర్వేపల్లి కాలువ పూర్తిగా ఆక్రమణలకు గురైంది. ఇక కృష్ణపట్నం కాలువ ప్రారంభం నుంచే ఆక్రమణల చెరలోకి వెళ్లిపోయింది. జాతీయ రహదారి వరకూ ఒక వైపు కాలువ జీప్ ట్రాక్‌ను ఆక్రమించి ఇళ్లు నిర్మించేశారు. ఇక దక్షిణం వైపు ముత్తుకూరు రోడ్డుకు సమాంతరంగా ఉన్న జీప్ ట్రాక్‌ను పూల మొక్కల వ్యాపారులు ఆక్రమించేశారు. వీరితోపాటు మరికొంత మంది ఏకంగా షెడ్లు వేశారు. ఇప్పుడు ముత్తుకూరు రోడ్డుకు, కృష్ణపట్నం కాలువకు మధ్య అడుగు కూడా ఖాళీ లేదు. మరి ఆ కాలువలో పూడిక ఎలా తీయాలి..? అంటే ఎవరి వద్దా సమాధానం లేదు. గతంలోనే ఈ కాలువ వెంబడి ఆక్రమణలు ఉన్నప్పుడు రైతులు, ప్రజల ప్రయోజనాల దృష్ట్యా ఆక్రమణలు తొలగించారు. కానీ మళ్లీ పూల మొక్కల వ్యాపారులు వైసీపీ ప్రభుత్వంలో స్థానిక నాయకుల అండతో ఆక్రమణలకు పాల్పడ్డారు. వీరిని చూసి మరికొందరు మిగిలిన స్థలాన్ని కూడా కబ్జా చేశారు. వీరికి కొందరు స్థానిక రాజకీయ నేతలు అండగా ఉంటూ నెల నెలా మామూళ్లు దండుకుంటున్నట్లు ఆరోపణలు న్నాయి. సర్వేపల్లి కాలువ వెంబడి ఉన్న వ్యాపారస్తుల పరిస్థితి కూడా ఇలానే ఉంది. ఇక్కడైతే అనేక శాశ్వత నిర్మాణాలు జరిగిపోయాయి. వీటిని నిర్మిస్తున్నప్పుడు రాజకీయ ఒత్తిళ్లతో అటువైపు చూడని ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు.. తీరా పూడిక తీత వంటి సమస్యలు వచ్చినప్పుడు హడావిడి చేస్తుంటారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ రెండు కాలువల ఆక్రమణ అన్నది కేవలం రైతాంగం సమస్యే కాకుండా నగర ప్రజలకు కూడా ఇబ్బందిగా మారింది. నగరంలోని చాలా మురికి కాలువలు ఈ రెండు కాలువల్లోనే కలుస్తున్నాయి. ఆ నీరు ముందుకు కదలకపోవడంతో దుర్వాసన వస్తోంది. అలానే ఆక్రమణల మూలంగా ట్రాఫిక్ సమస్య కూడా తీవ్రమవుతోంది.

డిగ్రీ పరీక్షలలో ఇద్దరు డీబార్

వెంకటాచలం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూనివర్శిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జరిగిన డిగ్రీ ఐదవ సెమిస్టర్ పరీక్షలలో ఇద్దరు విద్యార్థులు డీబార్ అయినట్లు వర్శిటీ పరీక్షల నిర్వాహణాధికారిణి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలలో మొత్తం 7,305 మంది విద్యార్థులకు 6,740 మంది హాజరు కాగా 565 మంది హాజరయ్యారు. నాయుడుపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు, నెల్లూరులోని కృష్ణచైతన్య డిగ్రీ కళాశాలలో ఒకరు డీబార్ అయినట్లు తెలిపారు.

హత్య కేసులో ప్రధాన నిందితుడి అరెస్ట్

నెల్లూరు (క్రైం, ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని కూరగాయల మార్కెట్ వద్ద గత నెల 15న జరిగిన హత్య కేసులో ప్రధాన నిందితుడిని శుక్రవారం చిన్నబజారు పోలీ సులు అరెస్ట్ చేశారు. వివరాలను ఆ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు మీడియాకు వెల్లడించారు. నగరంలోని ముత్తుకూరు గేటు సెంటర్ సర్వే పల్లి కాలువకట్టకు చెందిన వాకా అశోక్ కూరగాయల మార్కెట్‌లో పని చేసేవాడు. గతనెల 15వ తేదీ తెల్లవారు జామున అశోక్‌పై పాతనేరస్తులైన జీ రాము, పీ సందీప్ కత్తితో దాడిచేసి తీవ్రంగా గాయపరిచి పరారయ్యారు. అశోక్ జీజీహెచ్ లో చికిత్స పొందుతూ అదే రోజు మృతిచెందాడు. ఇన్‌స్పె క్టర్ కోటేశ్వరరావు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. గత నెల 22వ తేదీన సందీప్‌ను అరెస్ట్ చేయగా, ప్రధాన నింది తుడు జీ రామును శుక్ర వారం బోడిగాడితోట వద్ద అరెస్ట్ చేశారు. కాగా, మృతి చెందిన అశోక్‌పై పలు స్టేషన్లలో కేసులున్నాయని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

రన్‌ఫర్ యూనిటీలో పాల్గొన్న ఎస్పీ కృష్ణకాంత్



సర్దార్ పటేల్ ఉక్కు మనిషి : ఎస్పీ

- పోలీసు శాఖ ఆధ్వర్యంలో రన్‌ఫర్ యూనిటీ

నెల్లూరు(క్రైం), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): భారతదేశ సమైక్యత, సమగ్రతను కాపాడిన ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని ఎస్పీ జీ కృష్ణకాంత్ అన్నారు. అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు, సర్దార్ పటేల్ జయంతిని పురస్కరించుకుని పోలీసుశాఖ ఆధ్వర్యంలో గురువారం నెల్లూరులో రన్‌ఫర్ యూనిటీ కార్యక్రమం నిర్వహించారు. పోలీసు కవాతు మైదానం నుంచి పటేల్ నగర్ వరకు ఈ పరుగు సాగింది. వల్లభాయ్ విగ్రహానికి పోలీసు అధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశ అంతర్గత భద్రతకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ పటేల్ జయంతిని రాష్ట్రీయ ఏక్తాదివాస్‌గా ప్రతి ఏటా జరుపుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సౌజన్య, డీఎస్పీలు ఏ శ్రీనివాసరావు, డీ శ్రీనివాసరెడ్డి, ఘట్టమనేని శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, సంకురయ్య తదితరులు పాల్గొన్నారు.

త్వరలో వెయ్యి రూపాయలకే ఇసుక

- మూడు సిలిండర్లపై మహిళల సంతోషం
- పురపాలక శాఖ మంత్రి నారాయణ



మహిళకు పింఛను అందిస్తున్న మంత్రి నారాయణ

నెల్లూరు (వైద్యం), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ట్రాక్టర్ ఇసుకను త్వరలో వెయ్యి రూపాయలకే ఇస్తామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ వెల్లడించారు. శుక్రవారం నెల్లూరులోని దీనదయాళ్ నగర్‌లో జరిగిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఉచిత ఇసుక పాలసీ వచ్చాక నగర పరిధిలోని 4 రీచ్‌ల ద్వారా ఇసుకను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. గతంలో ట్రాక్టర్ ఇసుక రూ.4 వేల నుంచి రూ.5వేల దాకా ఉంటే, ప్రస్తుతం రూ.2వేల నుంచి రూ.1500లకు తగ్గిందని చెప్పారు. మరో 15 రోజుల్లో కేవలం వెయ్యి రూపాయలకే ఇసుక అందిస్తామని స్పష్టం చేశారు. అయితే వైసీపీ వాళ్లు ఇసుకపై ఎందుకు ఆందోళనలు చేస్తున్నారో అర్థం కావటంలేదని విమర్శించారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లు మహిళలకు ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామని, దీనిపై మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. రానున్న ఐదేళ్లలో నగరంలో రోడ్డు, కాలువలు పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, నగర కమిషనర్ సూర్యతేజ, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు రెడ్డి, నగర అధ్యక్షుడు మామిడాల మధు, నారాయణ విద్యాసంస్థల జీఎం విజయ భాస్కర్‌రెడ్డి, తాళ్లపాక అనురాధ, విజేతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారత్ పోర్టల్‌లో నర్సింగ్ సేవల అనుసంధానం

- జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్

నెల్లూరు (వైద్యం), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జనరల్ ఆసు పత్రిలో పనిచేస్తున్న నర్సుల సేవలను భారత్ పోర్టల్‌లో అనుసంధానం చేస్తామని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దానాయక్ వెల్ల డించారు. శుక్రవారం నెహ్రూ యువకేంద్రం ఆధ్వ ర్యంలో సేవద్వారా నేర్చుకోవటం కార్యక్రమాన్ని ఆసు పత్రిలో నిర్వహించారు. సూపరింటెండెంట్ మాట్లాడు తూ నర్సుల సేవలను అనుసంధానం చేయటం వెను క యువతలో సేవా భావాన్ని, దేశభక్తిని పెంచడమే ముఖ్య ఉద్దేశమన్నారు. అడిషనల్ సూపరింటెండెంట్ డాక్టర్ మస్తాన్‌బాషా మాట్లాడుతూ ప్రభుత్వ ఆసు పత్రికి ప్రతి రోజూ యాక్సిడెంట్ కేసులు వస్తుంటాయ న్నారు. వారికి నర్సులు ఎంతగానో సేవలు అంది స్తుంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన అధికారి మహేంద్ర రెడ్డి, పీహెచ్‌పీ జిల్లా అధ్యక్షగౌరవాధ్యక్షులు వేణుగోపాల్, జయప్రకాష్, నర్సింగ్ సూపరింటెండెంట్ గిరిజ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై తక్షణమే స్పందించండి

- ఎస్ఈ విజయన్

నెల్లూరు (జడ్పీ), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వినియోగదారులు, రైతులు, పరిశ్రమలు.. ఇలా ఎవరికి విద్యుత్ సమస్యలు ఏర్పడినా తక్షణమే స్పం దించి పరిష్కరించేలా ప్రతి అధికారి చొరవచూ పాలని విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్ ఆదేశించారు. ఆయన కార్యాలయం నుంచి శుక్రవారం జిల్లాలోని ఈఈలు, డీఈలు, ఏఈలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఏ ప్రాంతంలోనైనా విద్యుత్ సమస్యలు వస్తే వెంటనే స్పందించాలని, రైతులకు సంబంధించి ట్రాన్స్‌ఫార్మర్లు, ఫ్యూజు మార్పు వంటి వాటిని తక్షణం పరిష్క రించాలని ఆదేశించారు. బిల్లు బకాయిలపైనా ప్రత్యేక శ్రద్ధ వహించాలని, సౌర విద్యుత్‌పై వినియోగదారులకు మరింత అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో ఈఈలు శేషాద్రి బాలచంద్ర, మునీంద్ర తదితరులు పాల్గొన్నారు.

బస్సు దగ్ధం కేసులో ఒకరి అరెస్ట్

నెల్లూరు(క్రైం), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): యజమానిపై కక్షతో బస్సు దగ్ధం చేసిన కేసులో నిందితుడిని సంతపేట పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు... వేదాయపాళెం రైల్వే గేటు సమీపంలో నివసించే శ్రీనివాసులు రెడ్డి కామాక్షి ట్రావెల్స్ నిర్వహిస్తున్నారు. ఆయన వద్ద వెంకటేశ్వరపురానికి చెందిన గౌస్‌బాషా డ్రైవర్‌గా పనిచేసేవాడు. ఈ ఏడాది మొదట్లో గౌస్‌బాషా నడుపుతున్న బస్సు ప్రమాదానికి గురికావ డంతో అతనిని పనిలోనుంచి తొలగించారు. అప్పటి నుంచి యజమానిపై కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో గతనెల 30వ తేదీ నగరంలోని సింహపురి హోటల్ సమీపంలో నిలిపి ఉన్న బస్సును తగలబెట్టాడు. కేసు నమోదు చేసిన సంతపేట ఎస్ఐ బాలకృష్ణ శుక్రవారం నిందితుడిని బోసుబొమ్మ వద్ద అరెస్ట్ చేశారు. కాగా, అదేరోజు కారు దగ్ధం చేసిన కేసులో వేదాయపాళెం స్టేషన్ పోలీసులు గౌస్‌బాషాపై కేసు నమోదు చేశారు.

పట్టపగలే చోరీ

- రూ. 70 వేలు అపహరణ

అనంతసాగరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్ సెంటర్‌లో రాపూరు బాలిరెడ్డి ఇంట్లో శుక్రవారం పట్టపగలు దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఇంటికి తాళం వేసి ఉండగా చొరబడి బీరువా తాళాలు పగులగొట్టి రూ. 70 వేలు దోచుకెళ్లారు. ఇదే తరహాలో మినగల్లులోని మరో ఇంట్లో చొరబడే ప్రయత్నం చేయగా స్థానికులు గుర్తించి వెంబడించ డంతో ఇద్దరు పరార్ కాగా ఒకరిని పట్టుకొని అనంతసాగరం పోలీసులకు అప్పగించారు.

న్యాయం చేయాలని మాదిగల ధర్నా



తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న మారంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మాదిగలు

సీతారామపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : డెబ్బయి సంవత్సరాల క్రితం పెద్దల ఒప్పందంతో చాకలిలు, మాదిగలు వారి వారి సౌలభ్యం కోసం పరస్పరం మాన్యాలు మా ర్చుకొని ఎలాంటి సమస్య లేకుండా ఉన్న భూమిని రెడ్ల పేరుతో అడంగల్‌లో ఎక్కించటం అన్యాయ మని మండల పరిధిలోని మారంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మాదిగలు డాక్టర్ కలివెల ఎలీషా కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం తాహసిల్దార్‌ను కలిసి వినతి పత్రం అందించారు. అనంతరం కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కలివెల ఎలీషా కుమార్ మాట్లాడుతూ సర్వే నెంబరు 190-2, 132-3 భూములపై పూర్తి విచారణ చేసి, తప్పు చేసిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకొని మాదిగలకు న్యాయం చేయాలని కోరారు.

యువకులపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆలయ పవిత్రతను దెబ్బతీసే విధంగా వ్యవహరించిన ఐదుగురు యువకులపై సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... సంతపేట ఆంజనేయ స్వామి దేవస్థానం వద్ద గత నెల 28వ తేదీ రాత్రి ఐదుగురు యువకులు అనుచితంగా ప్రవర్తించారు. ఓ యువకుడు తన దుస్తులను విప్పి పక్కనే ఉన్న డ్రైనేజీ కాలువలో ముంచి మలిన దుస్తులను గుడివద్దగల చిన్న హనుమంతుని విగ్రహంపై విసిరేసి పరారయ్యారు. గత నెల 29వ తేదీ విగ్రహంపై మలిన దుస్తులు ఉండటాన్ని ఆలయ పూజారి గుర్తించి ఈవో పీ రఘురామయ్యకు, ధర్మకర్తలకు తెలియజేశారు. ఆలయ పవిత్రతను దెబ్బతీసే విధంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని గురువారం సంతపేట పోలీసులకు ఈవో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ బాలకృష్ణ కేసు నమోదు చేశారు. సాంకేతికత ఆధారంగా నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

మోటార్ల చోరీ కేసులో నిందితుల అరెస్టు

- రూ.11.5 లక్షల సొత్తు రికవరీ



స్వాధీనం చేసుకున్న మోటార్లను పరిశీలిస్తున్న ఏఎస్పీ

ముత్తుకూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో జరుగుతున్న వరుస మోటార్ల చోరీ కేసుల్లో 9 మంది నిందితులను శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి సుమారు రూ.11.5 లక్షల సొత్తు రికవరీ చేశారు. ఈ మేరకు శుక్రవారం ముత్తుకూరు పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అడిషనల్ ఎస్పీ సౌజన్య వివరాలు వెల్లడించారు. వరుసగా జరుగుతున్న మోటార్ల దొంగతనాలపై ఎస్పీ ఆదేశాల మేరకు నిఘా ఉంచామన్నారు. ఈక్రమంలో మండల పరిధిలోని పంటపాలెం వద్ద 9 మంది నిందితులను అరెస్టు చేశామన్నారు. వారిలో ఇద్దరు బాల నేరస్తులు ఉన్నారన్నారు. వారి నుంచి రూ.8.75 లక్షల విలువ చేసే 43 విద్యుత్ మోటార్లు, చోరీకి ఉపయోగించిన వాహనాలతో కలిసి రూ.11.5లక్షల సొత్తును స్వాధీనం చేసుకున్నామన్నారు. అరెస్టు చేసిన వారిలో పాదర్తి వెంకటేష్, ఆములూరు ప్రవీణ్, బద్రి, పవన్, వంశీ, మాతంగి వినయ్, మోమిడి రాజాలు ఉన్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన కృష్ణపట్నం పోర్టు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవినాయక్, ముత్తుకూరు, కృష్ణపట్నం ఎస్ఐలు విశ్వనాథ్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, కానిస్టేబుళ్లు సుధాకర్, సుబ్బారావు, రజాక్, సిబ్బంది సుభాషిణి, రమణ, సుమన్, నాగార్జున, వేణు, శివ, భవానీ, కళ్యాణిలను అడిషనల్ ఎస్పీ సౌజన్య, రూరల్ డీఎస్పీ గంటా శ్రీనివాసులు అభినందించి అవార్డులు అందజేశారు.

అంకమ్మ ఆలయ ఈవోగా కార్తీక్

కందుకూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కందుకూరు గ్రామదేవత అంకమ్మ దేవాలయం ఈఓగా పి కార్తీక్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రం ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ అంకమ్మ ఆలయ అభివృద్ధికి కృషిచేస్తానని తెలిపారు.

అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం

కావలిటౌన్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగంతోనే ఆంధ్ర రాష్ట్ర అవ తరణ జరిగిందని, ఆయన త్యాగం చిరస్మరణీయమని ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ట్రంకురోడ్డులోని శ్రీరా ములు విగ్రహం వద్ద ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తటవర్తి రమేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి రామకృష్ణ, టీడీపీ నేతలు గుత్తికొండ కిషోర్, మలిశెట్టి వెంకటేశ్వర్లు, తిరివీధి ప్రసాద్, జ్యోతి బాబురావు, తటవర్తి వాసు, అర్షియా పాల్గొన్నారు.

● బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ సీవీసీ సత్యం, పట్టణ అధ్యక్షుడు బ్రహ్మానందం, ఏపీ జీఎస్టీ మెంబరు అమరా సుబ్బారావు, బెల్లంకొండ మాల్యాద్రి, కిరణ్ తదితరులు పాల్గొని శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైసీపీ కార్యాలయంలో నేతలు శ్రీరాములు చిత్రపటానికి నివాళు లర్పించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి అళహరి సుధాకర్ నివాళులర్పించారు. కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి లేళ్లపల్లి సురేష్‌బాబు తదితరులు నివాళులర్పించారు.

●కందుకూరు: స్థానిక టీడీపీ కార్యాల యంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వ ర్యంలో ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం నిర్వ హించారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ నాయకులతో కలిసి పొట్టిశ్రీరాములు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాసవీ క్లబ్ ప్రతినిధులు ఆధ్వర్యంలో పట్టణం లోని బండ్ల మిట్ట సెంటర్‌లో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులు అర్పించారు.

● ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంలో ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సత్రం సెంటర్‌లో ఏఎంసీ మాజీ చైర్మన్ ఇందూరు వెంకట రమణరెడ్డి, పలువురు ఆర్యవైశ్య సంఘం నాయకులు అమరజీవి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు పొన్నూరు హజరత్తయ్య, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ గార్లపాటి సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



కావలిటౌన్: పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, తదితరులు

● సంగం : సంగంలో రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దారు కార్యాలయ ఆవరణలో ఉన్న శ్రీపొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆర్యవైశ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

● దుత్తలూరు (ఉదయగిరి రూరల్) : ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు వై నాగరాజు, ఉద్యోగులు శ్రీపొట్టి శ్రీరాములకు ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సందానీ, ఆర్ఐ గులాం, వీఆర్వోలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు వినియోగించుకోవాలి

ఎం సురేష్‌బాబు, వ్యవసాయాధికారి, కలిగిరి



ఈ ముఖాముఖి

కలిగిరి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, రాయితీ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎం సురేష్‌బాబు కోరారు.

? రైతు సేవాకేంద్రంలో ఏఏ విత్తనాలు అందుబాటులో ఉన్నాయి.

! శనగలు(రెండురకాలు), వరి కేఎన్ఎం 1638, మినుములు వీబీఎన్-8 అందుబాటులో ఉన్నాయి. రాయితీపై కేవలం విత్తనాలు మాత్రమే అందజేస్తున్నాం.

? ఎరువులు, పురుగు మందులు తగినన్ని ఉన్నాయా.

! ప్రైవేటు దుకాణాల్లో అందుబాటులో ఉన్నాయి. అక్కడ కొనుగోలు చేసిన వాటికి రైతులు బిల్లులు తీసిపెట్టుకోవాలి. అందులో ఏమైనా తేడాలుంటే సంబంధిత దుకాణాదారులపై చర్యలు తీసుకొనేందుకు అవకాశం ఉంటుంది.

? ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు ఏమైనా దెబ్బతిన్నాయా.

! ఇటీవల కురిసిన వర్షాలకు ఎటువంటి నష్టం వాటిల్లలేదు.

రాళ్లపాడు ఆయకట్టుకు నీరందిస్తాం : ఎమ్మెల్యే ఇంటూరి

లింగసముద్రం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో వరి పైరు సాగుకు నీరందిస్తామని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చెప్పారు. శుక్రవారం పెంట్రాల పంచాయతీ పరిధిలోని రాళ్లపాడు అతిథి గృహం వద్ద పలు గ్రామాల ఆయకట్టు రైతులు, అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రాజెక్టులో 17.3 అడుగుల నీరు ఉందని, అధికారులతో చర్చించి ఈ సీజన్‌లో ఆయకట్టు రైతులు వరి నారుమళ్లు సాగు చేసుకొనేందుకు నీరు విడుదల తేదీని నిర్ణయిస్తామని చెప్పారు. ఆయకట్టు పరిధిలోని చివరి ఎకరాకు నీరందించే బాధ్యత తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఈలు వెంకటేశ్వరరావు, మధుసూదనరావు, ఏఈలు చంద్రమౌళి, మనోహర్, ఏడిఎలు రామిరెడ్డి, అనసూయ, ఏఓ అబ్రహాంలింకన్, ఆయకట్టు మాజీ చైర్మెన్ వరదయ్య, మాజీ సర్పంచు కిలారి కొండయ్య, మండల తెలుగు రైతు అధ్యక్షులు మద్దాలి రామారావు సుమారు 300 మంది రైతులు పాల్గొన్నారు.

మొదటి పంటకు సాగునీటికి ఢోకాలేదు

సంగం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కావలి పరిధిలోని చెరువులన్నీ జలకళ సంతరించుకున్నాయి.. మొదటి పంటకు సాగునీటి ఢోకాలేదు.. రైతులు ధైర్యంగా సాగు చేసుకోవచ్చని కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి రైతులకు హామీ ఇచ్చారు. గురువారం ఆయన స్థానిక ఇరిగేషన్ అధికారుల, నాయకుల సమక్షంలో సంగం వద్ద హెడ్ రెగ్యులేటర్లు ఎత్తి కావలి (బెజవాడ పాపిరెడ్డి) కాలువకు నీటిని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కావలి కాలువ సెక్షన్ అధికారులతోపాటు టీడీపీ నాయకులు జి శ్రీనివాసులు యాదవ్, ఆనం ప్రసాద్‌రెడ్డి, సూరా శ్రీనివాసులు రెడ్డి, బాణా శ్రీనివాసులు రెడ్డి, కోటు వెంకట కరుణాకర్‌రెడ్డి, బాబు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ హామీల అమలులో ముందడుగు : మంత్రి ఆనం



కందుకూరు: సిలిండరు అందజేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి , ఎమ్మెల్సీ కంచర్ల



కావలి రూరల్ : ఉచిత సిలిండర్ల వ్యానును జెండా ఊపి ప్రారంభిస్తున్న, ఎమ్మెల్యే, ఆర్డీవో



కలిగిరి : ఉచిత సిలిండర్ల పంపిణీలో పాల్గొన్న కంభం, చెంచలబాబు తదితరులు

ఆత్మకూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను తమ ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని రాష్ట్ర దేవదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఆత్మకూరు పట్టణంలో శుక్రవారం ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన జిల్లా జాయింట్ కలెక్టర్ కార్తీక్, ఆర్డీవో పావనితో కలిసి పట్టణంలోని అంబేద్కర్ నగర్‌లోని ఇంటింటికి వెళ్లి మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి ఆనం మాట్లాడుతూ ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలో ఈ పథకం కింద 23,313 మంది మహిళలు లబ్ధిపొందుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సి గంగాప్రసాద్, చైర్‌పర్సన్ జి వెంకటరమణమ్మ, ఎంపీపీ కేతా వేణుగోపాల్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి పాల్గొన్నారు.

● కందుకూరు : పట్టణంలో గ్యాస్ సిలిండర్లు పంపిణీని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. స్థానిక ఎమ్పీడీవో కార్యాలయం వద్ద జరిగిన సభలో ఎమ్మెల్యేతో పాటు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాం త్ పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి క్షీరభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఇక్బాల్, కమిషనర్ అనూష, ఎంపీడీఓ రత్నజ్యోతి, టీడీపీ నాయకులు దామా మల్లేశ్వరరావు, నార్నె రో శయ్య, బీజేపీ నాయకులు గట్టమనేని హరిబాబు పాల్గొన్నారు.

● కావలి రూరల్ : మండలంలోని తుమ్మలపెంటలో ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆర్డీవో వంశీక్రిష్ణతో కలిసి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ప్రారంభిం చారు. ఒక లబ్ధిదారు ఇంటికి వెళ్లిన ఎమ్మెల్యే గ్యాస్ సిలిండర్ బిగించడంతోపాటు స్వయాన టీ పెట్టుకుని తాగారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు ఆవుల రామక్రిష్ణ, సీనియర్ నాయకుడు పాలడుగు రంగారావు, ప్రధాన కార్యదర్శి ఉప్పాల వెంకట్రావు, ఎమ్పీడీవో శ్రీదేవి, తహసీల్దారు శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

● కలిగిరి : స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పీ.చెంచలబాబు పాల్గొన్నారు. ఉచిత గ్యాస్‌సిలిండర్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీపీ మెట్టుకూరు శిరీష ప్రారం భించారు. కార్యక్రమంలో తహసీల్దారు రవీంద్ర బాబు, ఎంపీడీవో ప్రత్యూష, టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణరెడ్డి, బీవీ రామారావు, తాతయ్య, అంబటి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

● కలువాయి : స్థానిక హెచ్‌సీ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం వద్ద కార్యక్ర మంలో అధికారులు, టీడీపీ మండల అధ్యక్షుడు జీ వెంకటేశ్వర్లు నాయడు, గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు మేకపాటి వెంకటనరసారెడ్డి, టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

లైసెన్సు లేకుండా ఎరువులు అమ్మితే చర్యలు

లింగసముద్రం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : లైసెన్సు లేకుండా విత్తనాలు, ఎరువులు అమ్మితే చట్టపరమైన చర్యలు తీకుంటామని కందుకూరు సహాయ వ్యవసాయ సంచాలకులు పి అనసూయ డీలర్లను హెచ్చరించారు. శుక్రవారం ఆమె లింగసముద్రంలోని పలు ఎరువులు, విత్తనాల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె స్టాకు రిజిస్టర్, బిల్లు పుస్తకాలను తనిఖీ చేశారు. రైతులు ఎరువులు, విత్తనాలు కొనేటప్పుడు తప్పని సరిగా బిల్లులు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి టి అబ్రహాంలింకన్ కూడా ఉన్నారు.

● అనంతసాగరం : మండలంలోని సోమశిల, అనంతసాగరంలోని ఎరువుల దుకాణాలను వ్యవసాయ సహాయ సంచాలకులు నందం శ్రీనివాసులు శుక్రవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులు పరిశీలించి ధరల వ్యత్యాసాన్ని పరిశీలించారు. రెండు షాపుల్లో రూ. 96,180 ఎరువులు, రూ 16,420 విలువ చేసే పురుగు మందులను సీజ్ చేశారు. రైతులకు జీఎస్‌టీ బిల్లులు తప్పక ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల అగ్రికల్చర్ అధికారి శ్రీదర్‌రెడ్డి ఉన్నారు.

కృష్ణంపల్లి చెరువు పనుల పరిశీలన

ఉదయగిరి రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణంపల్లి చెరువు మరమ్మతు పనులను శుక్రవారం జలవనరుల శాఖ ఈఈ వెంకటేశ్వర్లు, డీఈ చంద్రమౌళి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.32 లక్షల జపాన్ ఇంటర్నేషనల్ కో-అపరేటివ్ ఏజెన్సీ (జైకా) నిధులతో చెరువు మరమ్మతు పనులు చేపడుతున్నామన్నారు. చెరువు కట్టపై ముళ్లచెట్లను తొలగించడంతోపాటు తూము, అలుగులకు మరమ్మతులు చేపడతామన్నారు. పనులు త్వరితగతిన పూర్తిచేసి ఆయకట్టు రైతులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపడతామన్నారు. అనంతరం ఉదయగిరి ఆనకట్టను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈలు వేణు, సురేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో అంతర్గత రోడ్లు..

బిట్రగుంట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరు గ్రామంలోని అంతర్గత రోడ్లను టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు శుక్రవారం పరిశీలించారు. ఆయన వెంట టీడీపీ నేతలు బంకా జయరాజు, నరసింహరావు, హరిబాబు, స్థానికులు తదితరులు ఉన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

సీతారామపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారిణి హుస్సేనమ్మ అన్నారు. సీతారామపురం గ్రామ పంచాయతీలోని నారాయణంపేట దిగువ కాలనీలో శుక్రవారం డ్రైడే కార్యక్రమం లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గృహం, పరిసర ప్రాం తాల్లో నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రములో ల్యాబ్‌ను తగు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా సబ్ యూనిట్ అధికారి నౌషాద్‌బాబు, ఎంపిహెచ్ఓ మజీద్, రియాజ్, శేఖర్‌రాజు, ఆశకార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కమ్యూనిస్ట్ నేత చిమటా గణపతి మృతి

కావలి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్ట్ నేత చిమటా గణపతి(87) శుక్రవారం ఉదయం వృద్ధాప్యంతో మృతి చెందారు. కొండాపురం మండలం శాయిపేటలో చిమటా సుబ్బరామయ్య, రామసీతమ్మ దంపతులకు 1937 ఆగస్టు10న జన్మించిన గణపతి అతి పిన్న వయస్సులోనే ఉమ్మడి కమ్యూనిస్ట్ పార్టీలో చేరి చీలికల తర్వాత మార్కిస్ట్ పార్టీ కావలి తాలూకా కార్యదర్శిగా, జిల్లా కమిటీ సభ్యుడిగా పనిచేసిన చిమటా గణపతి(87) చివరి దశలో విశాఖ పట్టణంలో కుమారుడి వద్ద ఉంటున్నారు. భూముల పోరాటంలో జైలు జీవితం, ఎమర్జన్సీ సమయంలో కొద్దికాలం రహస్య జీవితం గడిపారు. 1980లో ఆయన వ్యక్తిగత కారణాలతో పార్టీ పూర్తికాలం కార్యకర్తగా, తాలూకా కార్యదర్శిగా, జిల్లా కమిటీ సభ్యునిగా బాధ్యతల నుంచి వైదొలిగారు.

నెల్లూరు సిటీ

రూరల్, కోవూరు, సర్వేపల్లి

న్యూస్ బాక్స్

పెంచలస్వామికి ప్రత్యేక పూజలు

రాపూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పెంచలకోన క్షేత్రంలో శుక్రవారం స్వాతి నక్షత్రం సందర్భంగా స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు అనంతరం కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం 6గంటలకు బంగారు గరుడసేవ, క్షేత్రోత్సవం జరిగింది. కాగా, నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్ వాస్తవ్యులు తమ్మినేని కిరణ్, రూప దంపతులు, వారి కుమారులు నిషాంత్, పూర్ణ ప్రసాద్ కుటుంబ సభ్యులు రూ.2,00,232 చెక్కు రూపంలో అందించారని ఉపకమిషనర్, ఆలయ కార్యనిర్వహణాధికారి పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

ముత్తుకూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కృష్ణపట్నం పంచాయతీ ఆర్కాట్‌పాలెంలో అదానీ కృష్ణపట్నం పోర్టు లిమిటెడ్ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా అదానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ సహర్ష్ పర్యవేక్షణలో వైద్యులు పలువురికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

సైదాపురం, నవంబరు 1: మండలంలోని సైదాపురం, అనంతమడుగు, చాగణం గ్రామాల్లో శుక్రవారం ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ 96 శాతం పింఛన్లు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : సోమిరెడ్డి



మనుబోలు : గ్యాస్‌సిలెండర్ అందిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి



కోవూరు : సిలిండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



నెల్లూరు : అనుమతిపత్రం అందచేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

● ఊరూరా అట్టహాసంగా ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ

మనుబోలు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో శుక్రవారం మహిళలకు ఉచితగ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు మండలాధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు గజమాలలతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలకు పొదుపులక్ష్మిని పరిచయం చేసింది టీడీ పీ ప్రభుత్వమేనన్నారు. గతంలో దీపం పథకం కింద సిలిండర్లు ఇచ్చింది టీడీపీ హయాంలోనేనన్నారు. ఇప్పుడు ఉచితంగా సిలిండర్లు ఇస్తున్నది తమ ప్రభుత్వమేనన్నారు. అంతకు మునుపు పొట్టి శ్రీరాముల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సీహెచ్ సుబ్బయ్య, ఎంపీడీవో జలజాక్షి, వసుమతి గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు కోటేశ్వరరెడ్డి, నాయకులు పచ్చిపాల రామిరెడ్డి, సాని వెంకటరమణయ్య, రాజాగౌడ్, దండు చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రదాత చంద్రబాబు : ఎమ్మెల్యే

కోవూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభివృద్ధి ప్రదాతగా రాష్ట్ర చరిత్రలో నిలచిపోతారని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయం ఎదుట దీపం-2 పథకంలో భాగంగా శుక్రవారం ఉచిత గ్యాస్ సిలిండర్లను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు నిర్మలానందబాబు, ఎంపీడీవో శ్రీహరిరెడ్డి, ఎంపీపీ పార్వతి, సర్పంచు విజయ, నాయకులు ఇంతా మల్లారెడ్డి, చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, జెట్టి రాజగోపాలరెడ్డి, సీహెచ్ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నెరవేరుస్తున్న ఎన్నికల హామీలు

నెల్లూరు రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల హామీలను ఒక్కొటిగా సీఎం చంద్రబాబు నెరవేర్చుకుంటూ వెళ్తున్నారని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం 36వ డివిజన్ బట్వాడిపాళెంలో దీపం-2 పథకం కింద ప్రభుత్వం అందచేస్తున్న ఉచిత గ్యాస్ సిలిండర్లను ఆర్డీవో నాగ సంతోష్ అనూషతో కలిసి లబ్దిదారులకు అందచేశారు. చంద్రబాబు హామీ ఇస్తే నెరవేర్చి తీరుతారన్నారు. ఈ కార్యక్రమంలో నాయ కులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, పిండి సురేష్, శాంతిశ్రీ, తాటి వెంకటేశ్వర్లు, సురేంద్రబాబు, పెంచల నాయుడు పాల్గొన్నారు.

పొదలకూరులో...

పొదలకూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ వద్ద శుక్రవారం ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దారు ఐ.రవి, ఎంపీడీవో కార్యాలయ ఏఓ మురళీకృష్ణ, నాయకులు తలచీరు మస్తాన్‌బాబు, బొద్దులూరు మల్లికార్జుననాయుడు, కోడూరు పెంచలభాస్కర్‌రెడ్డి, అక్కెం సుధాకర్‌రెడ్డి, బోగోలు బాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రేపు మహా పడిపూజ

నెల్లూరు (సాంస్కృతికం) నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మణికంఠ భక్త సేవా సమాజం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి 7గంటలకు అయ్యప్ప మహా పడిపూజ జరుగుతుందని గాదంశెట్టి చంద్రశేఖర్, గాదంశెట్టి హేమంత్ స్వామి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లక్ష్మీపురం శ్రీవారి నిలయంలో జరుగుతుందని, భక్తులు తరలిరావాలని కోరారు.

సమస్యలు పట్టించుకోకపోతే చెక్‌పవర్ రద్దు చేయిస్తా

● వైసీపీ సర్పంచుని హెచ్చరించిన ఎమ్మెల్యే

విడవలూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): గ్రామ సమస్యలు పట్టించుకోకపోతే చెక్ పవర్ రద్దు చేస్తానని వైసీపీ సర్పంచుని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి హెచ్చరించారు. మండలంలోని చౌకిచర్ల పంచాయతీ తుమ్మగుంట కాలనీలో శుక్రవారం జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీలో పర్యటించి లబ్ధిదారులకు పింఛన్లను అందజేశారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆగ్రహించిన ఎమ్మెల్యే పంచాయతీ సర్పంచు, అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె మాట్లాడుతూ కొన్ని రోజుల నుంచి రోడ్లు శుభ్రం చేయ్యలేదని, కరెంటు సమస్యలు ఉన్నా పట్టించుకోలేదని నిలదీశారు. సర్పంచు అంటే ప్రజలకు విధేయుడిగా ఉండాలని గ్రామ ప్రజలకు ఇబ్బందులు కలిగితే చెక్ పవర్ రద్దు చేయిస్తానని హెచ్చరించారు. అనంతరం అయ్యప్ప ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విడవలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఏర్పాటు చేసిన క్యాన్సర్ నిర్ధారణ ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె పరిశీలించారు. దీనిని అందరూ వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అడపా శ్రీధర్‌రెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, పా శం శ్రీహరిరెడ్డి, ఓగు నాగేశ్వరరావు, సమాది శ్రీనివాసులు, సత్యంరెడ్డి, ఆవుల వాసు, తదితరులు పాల్గొన్నారు.

బొలెరో వాహనం బోల్తా

నెల్లూరు రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు- పొదలకూరు రహదారి వెంబడి దొంతాలి వద్ద శుక్రవారం రాత్రి ఓ బొలెరో వాహనం బోల్తాపడింది. ఈ ఘటనలో ఎవరికీ ఏలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. పొదలకూరు నుంచి నెల్లూరుకు వస్తున్న బొలెరో వాహనం అదుపు తప్పి బోల్తాపడిందని, ఈ మార్గంలో రోడ్డుకు ఇరువైపుల ఉన్న పెద్ద చెట్లు ఇటీవల వర్షాలకు నేలకొరిగాయని, వాటి వల్ల తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు తెలిపారు.

ఏఎంసీ చైర్మన్‌కు ఘన సన్మానం

మనుబోలు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పొదలకూరు ఏఎంసీ చైర్మన్‌గా నియమితులైన గాలి రామకృష్ణారెడ్డిని పిడూరుకు చెందిన సోదరులు వెంకురెడ్డి, శ్రీధర్‌రెడ్డిలు శుక్రవారం మనుబోలులో ఘనంగా సన్మానించారు. శాలువాకప్పి, బొకే ఇచ్చి అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మానుగుంట సుధాకర్ రెడ్డి, కేవీ.కృష్ణయ్య, మన్నెమాల భాస్కర్‌రెడ్డి, మధునాయుడు, చిట్టిబాబు, కిరణ్‌కుమార్, పవన్‌కల్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి కాకాణిపై ఫిర్యాదు



సీఐకి ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

వెంకటాచలం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై వెంకటాచలం పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం టీడీపీ నేతలు ఫిర్యాదు చేశారు. తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావూరి రాధాకృష్ణ మనాయుడు ఆధ్వర్యంలో ఆపార్టీ నేతలు, కార్యకర్తలు పోలీస్ స్టేషన్‌కు చేరుకొని సీఐ సుబ్బారావును కలిశారు. ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబుపై మాజీ మంత్రి కాకాణి నిరాధారమైన ఆరోపణాల తోపాటు ఆసత్య ప్రకటనలు చేస్తున్నారని, సీఎంనే బెదిరించే ధోరణితోపాటు ఆగౌరవపరిచే విధంగా, అలజడి సృష్టించేలా కుట్రలు చేస్తు న్నారని విమర్శించారు. ప్రజలను విద్వేషాలతో రెచ్చగొట్టే విధంగా చట్టవ్యతిరేక చర్యలకు పాల్ప డుతున్న కాకాణిపై పోలీసులు కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి వల్లూరు రమేష్ నాయుడు, సీనియర్‌నేత ఉప్పలపాటి ధనుంజయనాయుడు, రావూరి పద్మనాభ నాయుడు, వలిపి మునుస్వామి, బత్తల రామ రామయ్య తదితరులున్నారు.

మీకు ఎన్నిసార్లు చెప్పాను?

● ఆరోగ్య విభాగంపై మంత్రి మరోమారు ఆగ్రహం

నెల్లూరు(సిటీ), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నగరంలో ఎక్కడ చూసినా చెత్తేనా?, మీకు ఎన్ని సార్లు చెప్పాను... ఇలాగైతే నాకు నచ్చదని అంటూ రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ మరోసారి కార్పొరేషన్ ఆరోగ్య విభాగంపై మండిపడ్డారు. నేను మాట చెప్పానంటే జరిగి తీరాల్సిందే..! అందులో ఎలాంటి మార్పు ఉండకూడదంటూ హుకూం జారీ చేశారు. శుక్రవారం నగర శివార్లలోని దీనదయాళ్ నగర్‌లో జరిగిన పింఛన్ల పంపిణీలో మంత్రి పాల్గొన్నారు. స్థానికంగా నడిచివెళ్తుండగా ఖాళీ స్థలంలో వ్యర్థాలు పడిఉండటాన్ని గుర్తించి ఆరోగ్య, సచివాలయ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ తర్వాత కాసేపటికే ఖాళీ స్థలంలోని చెత్తను తొలగించారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

● మండల వ్యవసాయాధికారిణి జ్యోత్స్నరాణి



ముత్తుకూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రైతులు వరి పంట సాగులో యాజ మాన్య పద్ధతులు పాటించాలి. సకాలంలో పంటలను సంరక్షించు కుంటే మంచి నా ణ్యమైన దిగుబ డులు వస్తాయి.

? రబీ సీజన్‌లో పంట సాగు విస్తీర్ణం ఎంత.

! రబీ సీజన్‌లో మండలంలో 9,600 ఎకరాల విస్తీర్ణంలో రైతులు వరిసాగు చేస్తుండగా, దాదాపు 400 ఎకరాల్లో వేరుశనగ సాగు చేస్తారు.

? సాగు ప్రారంభంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి.

! సరైన నేలలు, అందుకు అనుగుణంగా విత్తనాలను ఎంచుకోవడం కీలకం. దీనితోపాటు విత్తన శుద్ధి చాలా అవసరం. మొల కెత్తే శాతం చూసుకొని నార్లు పోసుకోవడం మంచింది.

? పెట్టుబడి తగ్గించుకోవడం ఎలా.

! రైతులు తమ పొలాల భూసార పరీక్షలకు అనుగుణంగా అవసరమైన పోషకాలు, ఎరువులను వాడుకోవాలి. తద్వారా సాగు పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది. దిగుబడి పెరిగి ఆదాయం పొందవచ్చు.

? తెగుళ్ల సమస్యకు పరిష్కారం ఏమిటి.

! వరినాట్లు పెరికే ముందే గుళికలు వేసుకొని నాట్లు వేయాలి. తద్వారా తొలిదశలో వచ్చే మోముపిప్పి వంటి తెగుళ్ల నుంచి సంరక్షించుకోవచ్చు. నారు కొసళ్ల కత్తిరించడం ద్వారా పురుగుల గుడ్ల నుంచి బయటపడవచ్చు.

తుమ్మగుంటలో అయ్యప్పకి విశేష పూజలు



మాట్లాడుతున్న ఆపధర్మ చైర్మన్ యర్రంరెడ్డి సుధాకర్‌రెడ్డి

విడవలూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చౌకిచర్లలో వెలసివున్న అయ్యప్ప దేవాలయంలో కార్తీక మాసంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహిస్తామని దేవాలయ ఆపధర్మ చైర్మన్ యర్రంరెడ్డి సుధాకర్‌రెడ్డి తెలిపారు. గ్రామంలో శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో అయన మాట్లాడుతూ దక్షిణ శబరిమలగా పూజలందుకుంటున్న గురునాథ అయ్యప్పస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఈనెల 15న ప్రత్యేకమైన పూజలను నిర్వహిస్తామన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది అయ్యప్ప భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేకంగా మరుగుదొడ్లు, స్నానపు గదులు ఏర్పాటు చేస్తున్నామని అలాగే వేడుకల్లో పాల్గొన్న భక్తులకు అన్నదానం చేస్తున్నామని తెలిపారు. ఈ సమావే శంలో గ్రామ సర్పంచు అరగల వినోద్ టీడీపీ నాయకులు కొడిమేర్ల శేషయ్య, గ్రామస్థులు కొమ్మిరెడ్డి కోటయ్య పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి చేయూత

● 'కేఎన్‌ఆర్' పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం



లక్ష రూపాయల బాండ్ అందిస్తున్న పూర్వవిద్యార్థులు

నెల్లూరు(విద్య), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని కేఎస్‌ఆర్ ఉన్నత పాఠశాలల 1993-94 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు వారి సహాధ్యాయి కుటుంబానికి ఆర్థిక చేయూతనందించారు. బీవీనగర్‌లో నివాసం ఉండే ఉమామహేశ్వరరావు ఇటీవల అనారోగ్య కారాణాలతో మృతి చెందారు. దీంతో ఆయన భార్య, ఇద్దరు పిల్లలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకు న్న మిత్రులందరూ స్పందించారు. లక్ష రూపాయలను సేకరించి దీపావళి పండుగనాడు ఉమామహేశ్వరరావు కుటుంబానికి బాండ్ అందచేశారు. ఇదే స్ఫూర్తితో మున్ముందు కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు.





ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డికి అభినందనలు

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : టీటీడీ పాలక మండలి సభ్యురాలిగా నియమితులైన కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి పలువురు నాయకులు అభినందనలు తెలిపారు. గురు, శుక్రవారాల్లో వేమిరెడ్డి నివాసానికి పెద్ద సంఖ్యలో టీడీపీ శ్రేణులు చేరుకుని శుభాకాంక్షలు తెలిపాయి. పార్టీ నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, నుడా మాజీ చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్, నాయకులు దువ్వూరు కల్యా ణిరెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి, జనసేన నేత నూనె మల్లికార్జున యాదవ్, కారంపూడి కృష్ణారెడ్డి, గునుకుల కిషోర్ ప్రశాంతిరెడ్డిని సత్కరించి అభినందనలు తెలిపారు. కాగా, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతులకు సర్వేపల్లి నియోజ కవర్గ టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభాకర్‌రెడ్డి పార్లమెంటులో పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ, ఫైనాన్సు కమిటీ, కన్సల్టేటివ్ కమిటీ ఫర్ ఎక్స్‌టర్నల్ ఎఫైర్స్ సభ్యుడిగా నియమితులైనందుకు, ప్రశాంతిరెడ్డి టీటీడీ సభ్యురాలిగా నియమితులైనందుకు మొక్కను అందించారు.

లక్ష దీపోత్సవ బ్రోచర్ ఆవిష్కరణ

కార్తీక మాసంలో నగరంలోని వీఆర్సీ మైదానంలో నిర్వహించే లక్ష దీపోత్సవ కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను వేమిరెడ్డి దంపతులు శుక్రవారం వారి నివాసంలో ఆవిష్కరించారు. ఈనెల 9, 10 తేదీల్లో లక్ష దీపోత్సవం జరుగుతుందని చెప్పారు. ఉత్సవ కమిటీ కార్యవర్గ సభ్యులు కంజర్ల భాస్కర్ శర్మ, ఆమంచర్ల వెంకట ప్రభాకర్ రావు, గంధం సునీల్‌కుమార్, ఆశం విజయసారధి పాల్గొన్నారు.

వెంకటాచలం యాక్ట్ రిపోర్టర్‌పై దాడి

వెంకటాచలం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వెంకటాచలంలోని కసుమూరు రోడ్డు కూడలి వద్ద గురువారం సాయంత్రం యాక్ట్ రిపోర్టర్ ప్రవీణ్‌పై కొంతమంది దాడి చేశారు. తన కూల్‌డ్రింక్ షాప్ వద్ద ఉన్న తనపై దొడ్డరాజుపాళెం గ్రామానికి చెందిన ఆరుగురు మారణాయుధాలతో దాడి చేసినట్లు బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ దాడిలో ప్రవీణ్‌కు గాయాలవగా, కూల్‌డ్రింక్ షాప్ ధ్వంసమైంది. ఈ ఘటనను జర్నలిస్ట్ సంఘాలు తీవ్రంగా ఖండించాయి. శుక్రవారం ఏపీఎంఎఫ్ నాయకులు జయరాజ్, విద్యాసాగర్ రెడ్డి, ఏపీడబ్ల్యూజే జిల్లా కార్యదర్శి దేవకుమార్‌తోపాటు మరికొంతమంది గాయపడిన ప్రవీణ్‌ను పరామర్శించారు. వెంకటాచలం సీఐ సుబ్బారావును కలిసి క్షేత్రస్థాయిలో విచారించి, ప్రవీణ్‌కు న్యాయం చేయాలని కోరారు. మరోవైపు ప్రవీణ్‌తో పాటు కొందరు తమపై దాడి చేశారంటూ కౌంటర్ కేసు ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రస్టు పేరుతో రాజకీయం చేస్తున్నారు!

మనుబోలు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : మనుబోలులో సేవానాదం ట్రస్టు పేరుతో ఆ ట్రస్టు నిర్వాహకులు రాజకీయం చేస్తున్నారని తిరుపతి పార్లమెంట్ తెలుగుయువత ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామిరెడ్డి విమర్శించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 42 అంకణాల పట్టాస్థలం అయితే 72అంకణాలను ఎలా రిజిష్టర్ చేశారన్నారు. పొలాలకు వెళ్ళే దారిని అడ్డగిస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు రమేష్‌రెడ్డి, కిరణ్‌కుమార్, వెంకటేశ్వర్లు, శివుడు రాజాగౌడ్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● మాచిరెడ్డి ఏ పార్టీకి చెందిన వ్యక్తికాదు

శ్రీ సేవానాదం ట్రస్టు వ్యవస్థాపకులు మాచిరెడ్డి ఏ పార్టీకి చెందిన వారు కాదని ఆ ట్రస్టు సభ్యుడు విజయ్ అన్నారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మాణానికి మట్టి, గ్రావెల్ పనులను అధికార పార్టీకి చెందిన కొంతమంది నాయకులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. భవిష్యత్తులో ప్రస్తుత ఎమ్మెల్యేచేతనే ఆగిన పనులను పునరుద్ధరిస్తామని తెలిపారు.

దీపావళి సంబరాలు

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నగరంలోని కార్జోన్ కార్యాలయంలో దీపావళి సంబరాలు అంబరాన్ని అంటాయి. ఉద్యోగులు, సిబ్బంది పసుపురంగు దుస్తులు ధరించి వేడుకల్లో పాల్గొన్నారు.

ఘనంగా ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం



నివాళులర్పిస్తున్న జనసేన నాయకులు

నెల్లూరు (సాంస్కృతికం/స్టోన్‌హౌస్‌పేట) నవంబరు 1(ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మబలి దానంతో నవంబరు 1న ఏర్పడిన ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని జిల్లాలో శుక్రవారం ఘనంగా జరుపు కున్నారు. పొట్టిశ్రీరాములు చిత్రపటాలు, విగ్రహాలకు పుష్పమాలలు వేసి నివాళులు అర్పించారు. నగరంలోని ఆత్మకూరు బస్టాండు వద్ద గల పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం నాయకులు కొండా ప్రవీణ్‌శంకర్, శేగు షణ్ముఖ రావు, కోట గురుబ్రహ్మం, ఎంపీ ఆంజనేయులు తదితరులు నివాళులు అర్పించారు.

● భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన సేవలు చిరస్మరణీయమని జనసేన పార్టీ నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు అన్నారు. 69వ ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జనసేన నాయకులు శుక్రవారం ఆత్మకూరు బస్టాండు వద్ద ఉన్న పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి కొట్టే వెంకటేశ్వర్లు, అజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

● తెలుగు ప్రజల ఆరాధ్య దైవం : మేయర్

పొట్టిశ్రీరాములు తెలుగు ప్రజలకు ఆరాధ్య దైవం అని నగర మేయర్ స్రవంతి అన్నారు. ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఆత్మకూరు బస్టాండు వద్ద పొట్టిశ్రీరాములు విగ్రహానికి పుష్పమాలల వేసి నివాళులు అర్పించారు. న్యాయవాది ఇర్ల రమణయ్య, పలువురు అధికారులు, అభిమా నులు, నటుడు సింగంశెట్టి మురళీమోహన్, జనసేన పార్టీ నాయకులు అమరజీవికి ఘనంగా నివాళులు అర్పించారు.

● నెల్లూరు(విద్య) : నగరంలోని బాలాజీనగర్ నలంద పాఠశాలలో ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కేఎస్‌వీ కిరణ్‌కుమార్, ఉపాధ్యాయు లు సుజన, హేమలత, సిబ్బంది పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

పొదలకూరు (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని శుక్రవారం ఆర్యవైశ్య సంఘం నేతలు ఘనంగా నిర్వహించారు. స్థానిక పంచాయతీ బస్టాండు ఆవరణంలోని పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మజ్జిగ, స్వీట్లు పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య నాయకులు నెల్లూరు రూరల్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అమర్తలూరు చెంచయ్య, గుర్రం మీరామధు, ఆదూరు వెంకటసుబ్బయ్య తదితరులు పొట్టిశ్రీరాములు త్యాగాలను కొని యాడారు. అనంతరం ఇటీవల అకాల మరణం కిషోర్ ఆత్మశాంతి కోసం రెండు నిమిషాలు మౌనం వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు పొట్టి సుధాకర్, ఆకులరి విజయ, పిన్నె ప్రభాకర్, రాజా, సురేంద్ర, తన్నీరు సాయిచందు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

నెల్లూరు(విద్య), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) :జిల్లాలోని విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పీఆర్‌టీయూ నాయకులు శుక్రవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈవో బాలాజీరావుకు వినతిపత్రం ఇచ్చారు. యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్ తిరుమలయ్య మాట్లాడుతూ జిల్లాలో ఉపాధ్యాయుల సర్దుబాటు చేపట్టినా నేటికీ కొన్ని ఉన్నత పాఠశాల ల్లో సబ్జెక్ట్ టీచర్ల కొరత ఉందన్నారు. బిట్రగుంట జడ్పీ పాఠశాలలో సోషల్ టీచర్, అప్పసముద్రం జడ్పీ పాఠశాలలో మ్యాథ్స్, కాకొల్లువారిపల్లి జడ్పీ పాఠశాలలో మ్యాథ్స్, సైన్స్ టీచర్ లేరన్నారు. ఈ సమస్యతోపాటు మరికొన్ని సమస్యలను డీఈవో దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు.

సోమిరెడ్డి ఇంటిముందు మహిళ కాన్పు

● వైద్య సేవలు అందించి పేరుపెట్టిన సర్వేపల్లి ఎమ్మెల్యే

నెల్లూరు రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) :నెల్లూరు రూరల్లోని అల్లీపురం వద్దనున్న సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నివాసం ఎదుట శుక్రవారం ఓ మహిళ శిశువుకు జన్మనిచ్చింది. అల్లీపురానికి చెందిన జానా లక్ష్మికి పురిటినొప్పులురాగా కుటుంబ సభ్యులు 108 వాహనానికి సమాచారమిచ్చారు. ఆ వాహనం రావడం ఆలస్యమవుతుందేమోనని ఆటోలో నెల్లూరుకు బయలుదేరారు. సోమిరెడ్డి ఇంటి వద్దకు వచ్చేసరికి 108 వాహనం ఎదురైంది. ఆటోలో ఉన్న లక్ష్మిని అంబులెన్స్‌లోకి ఎక్కించారు. నొప్పులు ఎక్కువగా ఉండటంతో అక్కడే కాన్పు చేశారు. తన ఇంటి ఎదుట అంబులెన్స్‌ను చూసిన సోమిరెడ్డి, ఆయన కోడలు శృతిరెడ్డి బయటకు వచ్చి విషయం తెలుసుకున్నారు. గర్భిణి లక్ష్మికి అవసరమైన వైద్య సేవలు అందించారు. ఆడ బిడ్డ జన్మించడంతో శిశువును ఎత్తుకుని సంతోషిగా నామకరణం చేశారు.

శ్రీవారి ఆలయంలో దీపావళి ఆస్థానం

తిరుమల శ్రీవారి ఆలయంలో గురువారం ఉదయం దీపావళి ఆస్థానం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ అర్చకులు, జీయంగార్లు, టీటీడీ ఉన్నతాధికారుల సమక్షంలో బంగారువాకిలి చెంత ఆగమోక్తంగా ఆస్థాన వేడుకను నిర్వహించారు. ముందుగా ఆలయంలో మూలవిరాట్టుకు, ఉత్సవమూర్తులకు నూతన పట్టువస్త్రాలు సమర్పించి రూపాయి హారతి, ప్రత్యేక హారతులను నివేదించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లు సహస్రదీపాలంకరణ సేవలో పాల్గొని మాడవీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. టీటీడీ ఈవో శ్యామలరావు , అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీవీఎస్వో శ్రీధర్, డిప్యూటీ ఈవో లోకనాథం, పేష్కార్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి





ముక్కంటి ఆలయంలో..



తిరుపతిలో..

టపాసులు కాల్చి.. నోములు నోచి

దీపావళి సందర్భంగా గురు, శుక్రవారాల్లో టపాసులు కాల్చారు. జిల్లాలో టపాసుల మోతెక్కింది. ఇలా టపాసులు కాల్చే క్రమంలో ఇనుప రేకు మెడకు గుచ్చుకోవడంతో పుత్తూరు మండలం గోపాలకృష్ణపురం ఎస్టీ కాలనీకి చెందిన చరణ్(14) మృతిచెందాడు. ఇక, శ్రీకాళహస్తితో పాటు అమ్మవారి ఆలయాల్లో కేదారి గౌరీదేవి వ్రతాన్ని నిర్వహించారు.

- 4లో

టీటీడీ బోర్డులో భానుకు దక్కిన చోటు

- తుడా చైర్‌పర్సన్‌కు ఎక్స్ అఫిషియో సభ్యత్వం
- ప్రత్యేక ఆహ్వానితుల నియామకానికి అవకాశం
- బీజేపీ కోటా ఓకే.. సజీవంగా టీడీపీ నేతల ఆశలు



తిరుపతి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): టీటీడీ బోర్డులో తిరుపతికి చెందిన బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డికి చోటు దక్కింది. తొలుత ఖరారైన జాబితాలో 25 మందికి గానూ చైర్మన్, 23 మంది సభ్యులతో కలిపి 24 పేర్లే వుండగా.. శుక్రవారం వెలువడిన జీవోలో 24వ సభ్యుడిగా జి.భానుప్రకాష్‌రెడ్డిని పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా తరచూ పార్టీ గొంతుకను బలంగా వినిపించిన ఈయనకు తగిన గుర్తింపు, గౌరవం దక్కింది. హిందూ ధర్మ పరిరక్షణతో పాటు టీటీడీ ప్రయోజనాల కోసం ఆయన చెప్పుకోదగ్గ పోరాటం చేశారు. టీటీడీ నిధులను ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు మళ్ళించడాన్ని వ్యతిరేకించారు. వకుళమాత ఆలయ స్థలాన్ని పరిరక్షించడంలో.. అలిపిరి వద్ద గోపూజ మందిరం ఏర్పాటు వెనుకా ఆయన కృషి వుంది. వైసీపీ హయాంలో నేరచరిత్ర కలిగిన వారిని టీటీడీ సభ్యులుగా నియమించడాన్ని, తిరుపతి అభివృద్ధికి టీటీడీ నుంచి రూ. వంద కోట్లు కేటాయించడాన్ని వ్యతిరేకించారు. ఈ అంశాలపై హైకోర్టులో న్యాయపోరాటం సాగించారు. ఓ దశలో అప్పటి అధికారులు ఆయనకు శ్రీవారి దర్శనాలు సైతం నిలిపివేసి వేధించారు. 2015-17 నడుమ రెండేళ్ళ పాటు టీటీడీ పాలకమండలి సభ్యుడుగా పనిచేసిన భానుప్రకాష్‌రెడ్డికి దేవస్థానం వ్యవహారాలపై లోతైన అవగాహన వుంది. బీజేపీలో ఉన్నత స్థాయి నేతలతో ఉన్న సన్నిహిత సంబంధాలు ఆయనకు అనుకూలంగా మారింది. బీజేపీ కోటాలో బోర్డు మెంబరు కోసం తీవ్ర పోటీ నెలకొనగా చివరకు భానుప్రకాష్‌రెడ్డికి దక్కింది.

తుడా చైర్మన్‌కు ఎక్స్‌అఫిషియో హోదా

టీటీడీ బోర్డులో తిరుపతికి చెందిన నేతలకు అవకాశం దక్కలేదు. అయితే తుడా చైర్మన్‌కు ఎక్స్ అఫిషియో సభ్యత్వం కల్పించడంతో ఇక్కడి నేతల ఆశలను సజీవంగా ఉంచుతోంది. గతంలో ఎప్పుడూ టీడీపీ ప్రభుత్వం తుడా చైర్మన్‌కు టీటీడీలో సభ్యత్వం కల్పించిన దాఖలాలు లేవు.అయితేతాజా జీవోలో ఎక్స్ అఫిషియో సభ్యత్వం కల్పించడంతో తుడా చైర్మన్ పదవికి క్రేజ్ పెరిగింది.దీంతో ఇపుడు తిరుపతికి చెందిన ముఖ్య నేతల దృష్టి తుడా చైర్మన్ పదవిపై మళ్లింది. ఇక, ప్రత్యేక ఆహ్వానితుల ప్రస్తావన జీవోలో లేకపోయినా,తదుపరి ఎప్పుడైనా ప్రభుత్వం ఇద్దరు లేదా ముగ్గురిని నియమించే అవకాశముంది.ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు, హైదరాబాదు వంటి ఇతర ముఖ్య నగరాల్లోని ఆరు లోకల్ అడ్వైజరీ కమిటీల అధ్యక్షులను కూడా ప్రత్యేక ఆహ్వానితులుగా నియమించే అవకాశమూ వుంది. ఆ కోటాలో తిరుపతి వారికి అవకాశం వుండదు కాబట్టి ప్రత్యేక ఆహ్వానితుల పదవులపైనే స్థానిక నేతలు ఆశపడుతున్నారు.

తిరుపతి ఎమ్మెల్యేకు అవకాశంపై అనిశ్చితి

తిరుపతి ఎమ్మెల్యేకి టీటీడీ ధర్మకర్తల మండలిలో ప్రత్యేక ఆహ్వానితుడి హోదా దక్కుతుందా లేదా అన్నదానిపై అనిశ్చితి కొనసాగుతోంది. కాంగ్రెస్ హయాంలో చిరంజీవికి.. వైసీపీ ప్రభుత్వం అప్పటి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డికి ఆ హోదా కల్పించింది. టీడీపీ ప్రభుత్వం గతంలో ఎప్పుడూ ఈ హోదా ఇవ్వలేదు. దీంతో తాజా బోర్డులో ఆ హోదా ఇస్తారా ఇవ్వరా అన్నదానిపై స్పష్టత రాలేదు.

ఉచిత సిలిండర్ల పంపిణీ ప్రారంభం



లబ్ధిదారులకు గ్యాస్ సిలిండర్లు అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

తిరుపతి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): దీపం-2 పథకం కింద ఉచిత సిలిండర్ల పంపిణీకి శుక్రవారం జిల్లాయంత్రాంగం శ్రీకారం చుట్టింది. తడ మండలం రామాపురంలో కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, ఆర్డీవో కిరణ్మయి తదితరులు ఉచిత సిలిండర్లు పంపిణీ చేశారు. మిగతా నియోజకవర్గాల్లోనూ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి పార్టీల నేతలు పాల్గొని ఉచిత సిలిండర్లు పంపిణీ చేశారు. ఈ ఉచిత సిలిండర్ల ప్రభావంతో బుకింగ్ రెట్టింపైంది. జిల్లాలో 62 ఎల్పీజీ గ్యాస్ ఏజెన్సీల పరిధిలో 4,92,302 గ్యాస్ కనెక్షన్లు వుండగా రేషన్ కార్డులు 6,00,350 వున్నాయి. ఇప్పటి వరకు జిల్లాలో రోజువారీ 300 నుంచీ 350 వరకూ సిలిండర్లు బుక్ అయ్యేవి. ప్రభుత్వం మొదటి ఉచిత సిలిండర్ ప్రకటన జారీ చేయడంతో రెట్టింపు సంఖ్యలో సిలిండర్లు బుక్ అవుతున్నాయి. 29, 30, 31 తేదీల్లో రెండు వేలకుపైగా సిలిండర్లు బుక్ అయ్యాయి. రోజువారీ 600కు మించి సిలిండర్లు బుక్ అవుతున్నాయని గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు చెబుతున్నారు. మొదటి ఉచిత సిలిండర్‌కు అర్హులైన వారు సిలిండరు అందుకున్న రెండు రోజుల్లోపే వారి ఖాతాలకు ప్రభుత్వం వంట గ్యాస్ ధర మొత్తాన్ని జమ చేయనుంది.



తిరుచానూరులో వితంతుపింఛను పంపిణీ చేస్తున్న డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు

సర్వర్ మొరాయించినా..!

- జిల్లాలో 96.44 శాతం పింఛన్ల పంపిణీ
- రాష్ట్రంలో మూడో స్థానం

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణ శుక్రవారం ఉదయం 6గంటలకు ప్రారంభమైంది. అయితే 8.30 గంటలకు సర్వర్‌లో సాంకేతిక సమస్య మొదలవగా, దాదాపు మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో పరిష్కారమైంది. దీంతో యథావిధిగా సచివాలయ ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి పింఛన్లు అందజేశారు. ఒక వైపు దీపావళి.. మరోవైపు సర్వర్ మొరాయించినా సాయంత్రానికి 2,56,029మందికి (96.44 శాతం) పింఛన్లను పంపిణీ చేశారు. రాష్ట్రంలో తిరుపతి జిల్లా మూడో స్థానం దక్కించుకుంది. దాదాపు రూ.108.33 కోట్ల పింఛన్లను పంపిణీ చేసినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. మిగిలిన మూడు శాతం శనివారం పంపిణీ చేస్తామని డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు తెలిపారు. ఈ పింఛన్ల పంపిణీలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

అయ్యాఎస్ అనకపోతే
ట్రాన్స్‌ఫర్ చేయిస్తా!



- ఐఏఎస్ అధికారికి కూటమి నేత దబాయింపు

జగన్ ప్రభుత్వంలో ఐదేళ్లు అధికారుల మీద దబాయింపు పాలన చూసిన కొందరు కూటమి నేతలు, మేం మాత్రం తక్కువా అన్నట్టుగా అదే మార్గాన్ని అనుసరించే ప్రయత్నం చేస్తున్నారు. తిరుపతి నగరంలోని ఒక పార్టీ నాయకుడు ఏకంగా ఐఏఎస్ అధికారి అయిన కార్పొరేషన్ కమిషనర్‌నే దబాయిస్తున్నాడనే ప్రచారం జరుగుతోంది. కాంట్రాక్ట్ వర్క్‌లు ఇవ్వండని అడగడమే గాక, తాను చెప్పిన వారిని బదిలీ చేయాలంటూ అడిగినట్లు తెలిసింది. అంతటితో సరిపెట్టుకోకుండా 'నాకు కార్పొరేషన్ ఆఫీస్‌లో ఛాంబర్ ఏర్పాటు చేయండి' అని కూడా ఆదేశించారని తెలియడంతో అందరూ నివ్వెర పోయినట్లు సమాచారం. పార్టీ నాయకులకు ఛాంబర్లు ఇవ్వడం కుదరదని అధికారి స్పష్టం చేయడంతో, చిర్రెత్తిపోయిన ఆ నాయకుడు ఆమె మీద ఇటీవల తిరుపతికి వచ్చిన జిల్లా ఇన్‌చార్జి మంత్రికి ఫిర్యాదు చేశారు. అ ఆధికారి పెళ్లికి అప్పట్లో జగన్మోహన్ రెడ్డి హాజరైన ఫొటోలను మంత్రికి చూపించి, ఆమె మన పార్టీకి వ్యతిరేకం అంటూ ఆమెను బదిలీ చేసేయాలని కూడా కోరడం విశేషం. జగన్ ప్రభుత్వంలో కొందరు కమిషనర్లు వైసీపీ నాయకులకు అయ్యాఎస్‌లా వ్యవహరించిన తీరు అందరికీ తెలిసిందే. ప్రస్తుత తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా ఎన్.మౌర్య మాత్రం ఐఏఎస్ అధికారిగా వ్యవహరిస్తున్నారన్న పేరుంది. తాము అడిగే గొంతెమ్మ కోర్కెలన్నింటినీ తీర్చకపోవడంతో కొందరు నాయకులు ఉడికిపోతున్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

ఆ చిన్నారి ఏమైంది?

వడమాలపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆ మూడున్నరేళ్ల చిన్నారి శుక్రవారం సాయంత్రం వరకు ఆడుతూ పాడుతూ కనిపించింది. ఆ తర్వాత నుంచి కనిపించలేదు. వడమాలపేట మండలంలోని యానాది కాలనీకి చెందిన ఈ చిన్నారి కనిపించడం లేదంటూ తల్లిదండ్రులు శుక్రవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాలనీకి చెందిన నాగరాజుపై అనుమానం వ్యక్తంచేశారు. ఆ చిన్నారికి చాక్లెట్లు కొనిస్తానంటూ తీసుకెళ్లాడని సాయంత్రం తీసుకెళ్లాడని అంటున్నారు. తల్లిదండ్రుల ఫిర్యాదు నేపథ్యంలో పోలీసులు చిన్నారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కాగా, ఆ చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడి.. హతమార్చాడని స్థానికంగా ప్రచారం జరుగుతోంది. ఈ విషయంలో పోలీసులు మాత్రం ఎలాంటి స్పష్టతనివ్వడం లేదు.

కార్తీక సోమవారాల్లో ఆర్టీసీ ప్రత్యేక టూర్ ప్యాకేజీ

తిరుపతి(ఆర్టీసీ), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీకమాసంలో వచ్చే సోమవారాలను పురస్కరించుకొని ఆర్టీసీ జిల్లా యంత్రాంగం ఒక్కరోజు ప్రత్యేక టూర్ ప్యాకేజీని ఏర్పాటు చేశారు. తిరుపతి డిపో పరిధిలోని నూతన అల్ట్రాడీలెక్స్ సర్వీస్‌ను ఎంపిక చేశారు. కార్తీకమాసం ప్రతి సోమవారాల్లో ఉదయం 6గంటలకు సీబీఎస్‌లోని ఏడుకొండల బస్టాండు నుంచి బయలుదేరి శ్రీనివాసమంగాపురం, తొండవాడ, అప్పలాయగుంట, నారాయణవనం, కైలాసనాధకోన, నాగలాపురం, సురుటుపల్లి పుణ్యక్షేత్రాలను సందర్శించి తిరిగి సాయంత్రం తిరుపతికి చేరుకుంటుంది. టిక్కెట్ ధరలు పెద్దలకు రూ. 400, పిల్లలకు రూ. 280 నిర్ణయించి ముందస్తు రిజర్వేషన్ సదుపాయం కల్పించినట్లు తిరుపతి డిపో మేనేజర్ బాలాజీ పేర్కొన్నారు.

రైల్వే ప్రాజెక్టులపై 4న పార్లమెంటరీ కమిటీ సమావేశం

తిరుపతి(కలెక్టరేట్/సెంట్రల్), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రైల్వేశాఖపై ఆన్ ది స్పాట్ స్టడీ టూర్ నిమిత్తం రెండు రోజుల పర్యటన నిమిత్తం పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఆదివారం రానుంది. సోమవారం ఉదయం దక్షిణ మధ్య రైల్వే జీఎం, అధికారులతో రైల్వేస్టేషన్ల మౌలిక వసతి సదుపాయాల కల్పనపై సమీక్షిస్తారు. మధ్యాహ్నం 3గంటలకు తిరుపతి రైల్వేస్టేషన్‌లో .కొగెతెరంర అభివృద్ధి పనులను పరిశీలించి అధికారులతో సమీక్షిస్తారు. తిరిగి రాత్రి 7.45 ఢిల్లీకి తిరుగుపయనం అవుతారు.

2 రోజుల శ్రీవారి హుండీ ఆదాయం రూ.7.03 కోట్లు

తిరుమల, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రెండు రోజుల్లో రూ.7.03 కోట్లు లభించింది. మంగళ, బుధవారాల్లో ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధ, గురువారాల్లో లెక్కించింది. ఈమేరకు రూ.7.03 కోట్లు ఆదాయం లభించినట్టు టీటీడీ ప్రకటించింది. ఇక, బుధవారం 55,219 మంది, గురువారం 63,987 భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే ఈ రెండురోజుల్లో 37,113 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

సెట్విన్ సీఈవో బదిలీ

తిరుపతి అర్బన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): సెట్విన్ సీఈవో మురళీకృష్ణను బదిలీ చేస్తూ యువజన సర్వీసులశాఖ కార్యదర్శి వినయ్‌చంద్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. పశుసంవర్ధశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్ విధులు నిర్వహిస్తున్న ఆయన్ను 2019 అక్టోబరు 3న డిప్యూటేషన్‌పై అప్పటి వైసీపీ ప్రభుత్వం ఉమ్మడిజిల్లా సెట్విన్ సీఈవోగా నియమించింది. అప్పటి నుంచి డిప్యుటేషన్‌ను పొడిగిస్తూ ఐదేళ్లుగా ఇదే పోస్టులో కొనసాగారు. ఎట్టకేలకు మాతృసంస్థకు బదిలీ చేస్తే కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తదుపరి ఉత్తర్వులు వెలువడేవరకు ప్రత్యామ్నాయంగా మరొక అధికారిని భర్తీచేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌కు సూచించారు.

రష్యా దేశస్తుల రాహుకేతు పూజ



జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని శుక్రవారం రష్యాకు చెందిన పది మంది భక్తులు దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. వీరు రూ.750 టిక్కెట్‌తో రాహుకేతు సర్పదోష నివారణ పూజలు చేయించుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. స్వామి అమ్మవార్లను దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని వారు పేర్కొన్నారు. ఆలయ శిల్పకళ ఎంతో అద్భుతంగా ఉందన్నారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

శివాలయ శిథిలాలు కాపాడుకోవాలి



ఇది 400 ఏళ్ల నాటి శివాలయం. ఈ శిథిలాలను కాపాడుకోవాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అభిప్రాయపడ్డారు. చంద్రగిరి మండలం శానంబట్లలోని స్వర్ణముఖినది ఒడ్డున ఈ శివాలయ శిథిలాలున్నాయి. క్రీస్తుశకం 16-17 శతాబ్దాల నాటి ఒక పర్లాంగు పొడవు, అడుగున్నర వెడల్పు గల రాతి కోట గోడ ఆనవాళ్లు, వరదలకు నేలమట్టమైన ఆలయ శిథిలాలను శుక్రవారం ఆయన ఎస్వీయూ విశ్రాంత తెలుగుశాఖాధిపతి పేటశ్రీతో కలిసి పరిశీలించారు. చారిత్రాక ప్రాధాన్యం గల విజయనగరం కాలానికి చెందిన కోటగోడలు, ఆలయ శిథిలాలను పునరుద్ధరించి భావితరాలకు అందించాలని గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు. వీరితో పాటు చరిత్ర పరిశోధకులు పాములపాటి శ్రీనాథ్‌రెడ్డి, ప్రకాష్, శ్రీకాంత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

- చంద్రగిరి, ఆంధ్రజ్యోతి

వెలుగుల దీపావళి













రాత్రి వేళ.. ఎప్పటిలా ఉండే లైట్లతో పాటు టపాసుల వెలుగుల్లో తిరుపతి నగరం ఎలా ఉండిందనడానికి ఈ చిత్రాలే నిదర్శనాలు. దీపావళి సందర్భంగా గురు, శుక్రవారాల్లో రాత్రి సమయాన రంగురంగుల వెలుగులతో నగరం దేదీప్యమానంగా వెలిగిపోయింది. చూపరులకు కనువిందు చేసింది. కాగా, పండుగ వేళ పల్లె పట్నం అనే తేడాలేకుండా జిల్లా అంతటా టపాసులతో మోతెక్కించారు. రాత్రివేళ శబ్దంతో పాటు వెలుగునిచ్చే టపాసులు కాల్చారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

శాస్త్రోక్తంగా కేదారి గౌరీదేవి వ్రతం





శ్రీకాళహస్తీశ్వరాలయంలో నోములు నోచుకుంటున్న మహిళలు

శ్రీకాళహస్తి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా కేదారి గౌరీదేవి వ్రతాన్ని నిర్వహించారు. ఆలయంలో పార్వతీదేవి అమ్మవారిని శ్రీకృష్ణదేవరాయ మండపంలో కొలువుదీర్చారు. అభిషేక పూజల అనంతరం కలశస్థాపనచేసి వ్రతం చేపట్టారు. అమ్మవారికి మంత్రపుష్పం, నైవేద్యం సమర్పించారు. మహిళా భక్తులు పెద్దసంఖ్యలో హాజరై వ్రతం చేశారు. నోములు నోచుకుని నోముదారాలు స్వీకరించారు. ఈవో చంద్రశేఖర్ ఆజాద్, ఆలయ అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో అమ్మవారి ఆలయాల్లో, తమ ఇళ్ల వద్ద పలువురు నోములు నోచుకున్నారు.

బాణసంచా కాల్చే క్రమంలో రేకు గుచ్చుకుని బాలుడి మృతి

● పలు ప్రాంతాల్లో 14 మందికి తీవ్ర గాయాలు



గాయపడి, మృతిచెందిన చరణ్ - చికిత్స పొందుతున్న పలువురు బాధితులు

తిరుపతి(వైద్యం), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా టపాసులు కాల్చే క్రమంలో 14 ఏళ్ల బాలుడు మృతిచెందగా, మరో 14 మందికి తీవ్ర గాయాలయ్యాయి. పుత్తూరు మండలం గోపాలకృష్ణపురం ఎస్టీ కాలనీకి చెందిన చరణ్(14) గురువారం రాత్రి రేకుపై టపాసు పెట్టి కాల్చాడు. ఆ టపాసు ధాటికి రేకు ఎగిరిపడి బాలుడి మెడపై గుచ్చుకుంది. వెంటనే కుటుంబ సభ్యులు అతడిని రుయాస్పత్రికి తీసుకొచ్చారు. మెడ లోపలి భాగం వరకు రేకు కోసుకుపోవటాన్ని గుర్తించి వైద్యులు వెంటనే శస్త్రచికిత్స చేశారు. బాలుడు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. అలాగే పలు ప్రాంతాల్లో టపాసులు కాల్చే క్రమంలో మరో 14 మంది గాయపడి రుయాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా, టపాసులు కాల్చే క్రమంలో జరిగే ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని రుయా అధికారులు గురువారం రాత్రి నుంచి శుక్రవారం వరకు అప్రమత్తంగా ఉంటూ అత్యవసర విభాగంలో నిరంతరం ప్రత్యేక వైద్య సేవలను అందించారు.

కళ్లలో కారం కొట్టి.. రాడ్లతో దాడి చేసి..!

● కడివేడు గ్రామంలో వ్యక్తి హత్య



వెంకటేష్ (ఫైల్ ఫొటో)

చిల్లకూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండలం కడివేడు అరుంధతివాడలో పాత కక్షల నేపథ్యంలో గురువారం రాత్రి ఓ వ్యక్తిని దారుణంగా హతమార్చారు. స్థానికులు తెలిపిన ప్రకారం.. గోపాల్, రమణమ్మ దంపతుల కుమారుడు వెంకటేష్(35)కు, అదే ప్రాంతానికి చెందిన పొట్టేళ్ల సుబ్రహ్మణ్యం, పల్లెపాటి సాయికుమార్, సుళ్లూరు సునీల్‌తో పాత గొడవలున్నాయి. వీరి మధ్య తరచూ గొడవలు జరిగేవి. కొంతకాలంగా హైదరాబాదులోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేసుకుంటున్న వెంకటేష్ దీపావళి కోసం నాలుగు రోజుల క్రితం ఇంటికి వచ్చారు. రెండు రోజుల కిందట వెంకటేష్, సుబ్రహ్మణ్యం మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో సాయికుమార్, సునీల్‌తో కలిసి సుబ్రహ్మణ్యం గురువారం రాత్రి వెంకటేష్ ఒక్కడే ఇంట్లో ఉన్న సమయంలో కళ్లలో కారం చల్లి రాడ్లతో కొట్టి హత్య చేశారు. డీఎస్పీ రమణ కుమార్, సీఐ కిషోర్‌బాబు, ఎస్‌ఐ సురేష్‌బాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో వెంకటేష్ మృతదేహాన్ని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ పరిశీలించి వారి కుటుంబీకులకు సానుభూతిని తెలియజేశారు.

మద్యం మత్తులో తండ్రిని హతమార్చాడు



మృతిచెందిన చిన్నరామయ్య

వాకాడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కని పెంచిన తండ్రినే మద్యం మత్తులో ఓ కొడుకు కడతేర్చాడు. ఈ ఘటన వాకాడు మండలంలోని దుగరాజపట్నం పంచాయతీ శ్రీనివాసపురం గిరిజన కాలనీలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నాగబాబు తెలిపిన ప్రకారం.. తుపాకుల చిన్నరామయ్య(78), ఆయన కుమారుడు రమేష్ రోజువారీ కూలి పనులకు వెళ్లేవారు. దీపావళి పండుగ సందర్భంగా గురువారం రాత్రి తండ్రీ కొడుకులు కలసి మద్యం తాగారు. మద్యం మత్తులో వీరిద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. రాత్రి 9 గంటల సమయంలో మాటామాటా పెరిగి రమేష్ కర్ర తీసుకొని తండ్రి తలపై బలంగా కొట్టాడు. ఒక్కసారిగా చిన్నరామయ్య కుప్పకూలి ప్రాణాలు విడిచాడు. తండ్రి చనిపోవడంతో రమేష్ పరారయ్యాడు. గ్రామస్థుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముక్కంటి ఆలయంలో జారిపడి భక్తురాలికి తీవ్రగాయాలు



గాయపడిన మమత

శ్రీకాళహస్తి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో జారి పడటి మమత(40) అనే భక్తురాలు తీవ్రంగా గాయపడ్డారు. తెలంగాణ రాష్ట్రం కామారెడ్డికి చెందిన ఈమె తిరుపతిలో నివాసం ఉంటున్నారు. గురువారం భార్యాభర్తలు ఆలయానికి రాగా.. అమ్మవారి సన్నిధి నుంచి వెలుపలకు వచ్చే సమయంలో స్వర్ణ తాపడ ఉత్సవమూర్తి వాహనల వద్ద నేలపై నూనె ఉంటంతో ఆమె జారి పడటంతో గాయపడ్డారు. శ్రీకాళహస్తిలోని ప్రైవేటు వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి వెళ్లారు.

46 కిలోల గంజాయి స్వాధీనం

● నలుగురు తమిళనాడువాసుల అరెస్టు

తడ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తడ రైల్వే స్టేషన్ వద్ద 46 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్టు చేసినట్లు సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు గురువారం ఉదయం తడ రైల్వే స్టేషన్ వద్ద పోలీసులు నిఘా పెట్టారు. స్టేషన్ బయట నలుగురు వ్యక్తులు బ్యాగులతో అనుమానాస్పదంగా తిరగుతుండటాన్ని గమనించి అదుపులోకి తీసుకున్నారు. బ్యాగులను తనిఖీ చేయగా గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించగా చెన్నైలోని ఆవడికి చెందిన ఎస్.రాజరాజన్, అంబత్తూరుకు చెందిన ఎస్.తమిళమణి, చెంగల్‌పట్టు జిల్లా చేయ్యిడూరుకు చెందిన ఎస్.సారధి, కోయ్యంబత్తూరుకు చెందిన పి.రమేష్‌గా తెలిసింది. వీరు శ్రీకాకుళం నుంచి గంజాయిని తమిళనాడుకు తీసుకెళుతున్నట్లు వెల్లడించారు. నలుగురు వ్యక్తుల నుంచి 46 కిలోల గంజాయి, 3 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ మురళీకృష్ణ తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనపరచిన ఎస్‌ఐ కొండపనాయుడు, సిబ్బందిని సీఐ అభినందించారు.



పట్టుబడ్డ గంజాయి, నిందితులతో పోలీసులు

బాలికకు యువకుడి వేధింపులు

● ఫోక్సో కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఇంటర్ చదువుతున్న ఓ బాలికను వేధిస్తున్న యువకుడిపై ఫోక్సో కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ వెంకటనారాయణ తెలిపారు. సత్యసాయి జిల్లా వేపమానుపేటకు చెందిన టి. శివకుమార్ రెడ్డివారిపల్లిలోని ఓ బాలికల పాఠశాలకు వాహనంలో సిలిండర్లు సరఫరా చేసేవాడు. అక్కడ చదివే బాలికతో పరిచయం పెంచుకున్నాడు. ఆ తర్వాత బాలిక ఇంటర్ కోసం తిరుపతిలో చేరింది. అతడు తరచూ తిరుపతికి వచ్చి ఆ బాలికతో మాట్లాడేవాడు. ఈ క్రమంలో పెళ్లి ప్రపోజల్ తేగా ఆమె ఒప్పుకోలేదు. అతడు మాత్రం వేధిస్తూనే ఉన్నాడు. దీనిపై ఆమె తల్లి తండ్రులకు చెప్పడంతో బుధవారం వారు ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి శివకుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ చెప్పారు.

రన్ ఫర్ యూనిటీ





సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా పోలీసులు 'రన్ ఫర్ యూనిటీ (ఏక్తా యాత్ర)' నిర్వహించారు. తొలుత పటేల్ చిత్రపటానికి ఎస్పీ సుబ్బరాయుడు తదితరులు నివాళులర్పించారు. అనంతరం ఎస్పీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ ఎస్వీ ఆర్ట్స్ కళాశాల వరకు సాగింది. దేశ సమగ్రతను కాపాడిన ఉక్కు మనిషి పటేల్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని ఎస్పీ సూచించారు. అనంతరం వ్యాస రచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు, పోలీసులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

శ్రీవారి సేవలో జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్



జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్

తిరుమల, నవంబరు1(ఆంధ్రజ్యోతి): గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం ఆలయంలోకి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. అలాగే కోల్‌కాతా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి, హ్యూమన్ రైట్స్ కమిషనర్ జస్టిస్ జ్యోతిర్మయి భట్టాచార్య,కంచికామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి కూడా గురువారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.



జస్టిస్ జ్యోతిర్మయి భట్టాచార్య

లోకం శాంతిగా ఉండాలని ప్రార్థించా



తిరుమల, నవంబరు1(ఆంధ్రజ్యోతి): లోకం శాంతిగా, సుభిక్షంగా ఉండాలని శ్రీవారిని ప్రార్థించినట్లు కంచికామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి తెలిపారు. శ్రీవారి ఆలయంలో దీపావళి ఆస్థానంలో పాల్గొన్న ఆయన.. మీడియాతో మాట్లాడారు. ఈనెల 18 నుంచి జనవరి 1వ తేదీ వరకు అయోధ్యలో జరిగే మహా చండియాగానికి టీటీడీ కూడా సహకరిస్తోందన్నారు. దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలనే ఆకాంక్షతో తిరుపతి నుంచి అయోధ్యకు శ్రీరామ యంత్రం పంపామని గుర్తుచేశారు. శ్రీవారి గర్భాలయంలోనూ శ్రీరాములవారి ఉత్సవమూర్తి విగ్రహం ఉందన్నారు. రాములవారికి తిరుమలకు ప్రత్యేక సంబంధాలున్నాయన్నారు. ఇక, టీటీడీ నూతన బోర్డులోని సభ్యులు మంచి సేవలు అందించాలని కోరారు.

ముక్కంటి ఆలయంలో 'ఆకాశదీపం'



శ్రీకాళహస్తి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం ఆకాశదీపం వెలిగించారు. కార్తీక మాసం పురస్కరించుకుని ప్రతి రోజు ఆకాశ దీపాన్ని వెలిగించడం సంప్రదాయం. ఇందులో భాగంగా ఊంజల్‌మండపం వద్ద కార్తీక దీపానికి పూజలుచేశాక స్థూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

రౌడీ రాజకీయాల సంస్కృతి వైసీపీదే: టీడీపీ



మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

కోట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రౌడీ రాజకీయాల సంస్కృతి వైసీపీదేనని టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్ అన్నారు. కోటలో శుక్రవారం పలువురు టీడీపీ నాయకులు విలేకర్లతో మాట్లాడారు. ఐదేళ్లపాటు అధికారంలో ఉన్న వైసీపీ నేతలు రౌడీ రాజకీయాలు చేసి ఎంతో మందిని పొట్టనపెట్టుకున్న సంఘటనలు ప్రజలు మర్చిపోలేదన్నారు. ఇవన్నీ గుర్తించిన రాష్ట్ర ప్రజలు వైసీపీకి 11 సీట్లు ఇచ్చి బుద్ధి చెప్పారన్నారు. అధికారం కోల్పోయినా వైసీపీ నాయకులు దౌర్జన్యకాండ చేస్తూ ఇద్దరు టీడీపీ కార్యకర్తలను దారుణంగా చంపడం దుర్మార్గమన్నారు. తమ ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్ శాంతియుత మార్గంలో పయనిస్తూ తమకు క్రమశిక్షణ నేర్పారన్నారు. దీన్ని అలుసుగా తీసుకొని వైసీపీ నాయకులు రెచ్చిపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని టీడీపీ నాయకులు హెచ్చరించారు. సమావేశంలో జలీల్ అహ్మద్, దారా సురేష్, షంషుద్దీన్, నాయబ్, నౌషాద్, బాబు తదితరులు పాల్గొన్నారు.

చెంగాళమ్మ సేవలో ఎంపీ వేమిరెడ్డి దంపతులు



చెంగాళమ్మ ఆలయంలో వేమిరెడ్డి దంపతులు

సూళ్లూరుపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారిని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతులు గురువారం దర్శించుకొన్నారు. ఆలయం వద్ద వేమిరెడ్డి దంపతులకు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, టీడీపీ నాయకులు స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు ఆశీర్వచనం చేయగా సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయంలో నిత్యాన్నదాన కార్యక్రమానికి రూ.5 లక్షలు, ఆలయ అభివృద్ధికి మరో రూ.7 లక్షల చెక్కును దేవదాయశాఖ సహాయ కమిషనర్ ప్రసన్న లక్ష్మీకి వేమిరెడ్డి దంపతులు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవనాయుడు, వాకచర్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగిస్తే ఊరుకోం



మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఏపీవోలు, ఫీల్డ్ అసిస్టెంట్ల నిరసన

కోట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగిస్తే ఊరుకోబోమని ఉపాధి ఏపీవో, క్షేత్రసహాయకులు అన్నారు. ఏపీవో పూర్ణిమపై దాడి యత్నాన్ని ఖండిస్తూ శుక్రవారం కోట మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఉపాధి ఏపీవోలు, క్షేత్రసహాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు రోజుల క్రితం ఏపీవో పూర్ణిమపై వైసీపీ నాయకుడు ఉప్పల ప్రసాద్‌గౌడ్ ఆధ్వర్యంలో దాడి యత్నాన్ని తీవ్రంగా ఖండించారు. మహిళా ఉద్యోగులను అసభ్యకర పదజాలంతో దూషిస్తూ అవమానించడం మానుకోకపోతే వైసీపీ నాయకులకు గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు, గూడూరు మండలాల ఏపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్లు, క్షేత్రసహాయకులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో కేదారేశ్వర నోములు



నోములు నోచుకుంటున్న మహిళలు

నాయుడుపేట టౌన్/సూళ్లూరుపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణంలోని పలు ఆలయాల్లో మహిళలు భక్తి శ్రద్ధలతో నోముల పూజ నిర్వహించారు. దీపావళి పండుగను పురస్కరించుకొని ఆలయాల్లో వేదపండితులు కలశం ఏర్పాటు చేసి నోముల పూజ నిర్వహించారు. మహిళలు పాల్గొని పిండి దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ● సూళ్లూరుపేటలోని మద్వేంకట రామమూర్తి స్వామి ఆలయంలో శుక్రవారం దీపావళి అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని కేదారేశ్వర నోము పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో కేదారేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాన్ని కొలువుదీర్చి పుష్పాలతో అలంకరించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ మహిళలు సామూహిక కేదారేశ్వర నోము వ్రత పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త బీరక రాంబాబు, ప్రధాన అర్చకులు అనంతకుమార్ దీక్షితులు పాల్గొన్నారు.

ఉచిత గ్యాస్ బుకింగ్‌పై అవగాహన

నాయుడుపేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సంజాయ్‌గాంధీ కాలనీలో మహిళలకు ఉచిత గ్యాస్ బుకింగ్‌పై అధికారులు, నాయకులు అవగాహన కల్పించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీల అమల్లో భాగంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు మున్సిపల్ వైస్‌చైర్మన్ రఫీ తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దారు రాజేంద్ర, మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా, ఎంపీడీవో సురేష్ బాబు, సివిల్ సప్లయ్ డీటీ గోపీనాథ్‌రెడ్డి, నాయకులు అరవపెరిమిడి చంద్రారెడ్డి, చక్రపాణి, ముత్యాలయ్య తదితరులు పాల్గొన్నారు.

మోటరు సైకిల్‌ను ఢీకొన్న బస్సు
యువకుడికి స్వల్పగాయాలు

నాయుడుపేట టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - పాత బస్టాండ్ సమీపంలో మోటరు సైకిల్‌ను ప్రైవేట్ బస్సు ఢీకొన్న ఘటనలో రమేష్ అనే యువకుడికి స్వల్పగాయాలయ్యాయి. శుక్రవారం రమేష్ మోటరు సైకిల్‌పై పాత బస్టాండ్ సమీపంలోకి వెళ్తుండగా ప్రైవేట్ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో రమేష్‌కు స్వల్పగాయాలయ్యాయి.

జోరుగా టీడీపీ సభ్యత్వ నమోదు

చిట్టమూరు, నవంబర్ 1(ఆంధ్రజ్యోతి) చిట్టమూరు మండలంలో టీడీపీ సభ్యత్వ నమోదు జోరందుకుంది. టీడీపీ సభ్యత్వం చేసుకొనేందుకు ప్రజలు ఆశక్తి చూపడంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు సభ్యత్వాలు చేయడంలో నిమగ్నమైనారు. జిఎల్‌డబ్ల్యూ, వైఎఇ ఐడీ నెంబర్లు ఉన్న ఓటరు కార్డులు సభ్యత్వాలు అవుతున్నాయని, ఏపీ ఐడీతో ఉన్న ఓటరు కార్డులు తీసుకోవడం లేదన్నారు. ఏపీ ఉన్న ఓటర్‌లు సమీప మీసేవలో కానీ, సచివాలయంలో కానీ మార్పించుకోవాలని టీడీపీ మండల కన్వీనర్ గణపర్తి కిషోర్ నాయుడు నాయకులు, కార్యకర్తలకు సూచించారు.

వైసీపీ నేత అరెస్టు

కోట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కోట మండలం గోవిందపల్లికి చెందిన వైసీపీ నాయకుడు, మాజీ జడ్పీటీసీ ఉప్పల ప్రసాద్‌గౌడ్‌ను అరెస్టు చేసి నెల్లూరు సబ్ జైలుకు పంపినట్లు ఎస్ఐ పవన్‌కుమార్ శుక్రవారం తెలిపారు. రెండు రోజుల క్రితం ప్రసాద్ గౌడ్ ఆధ్వర్యంలో పలువురు మహిళలు ఉపాధి ఏపీవో పూర్ణిమ విధులకు ఆటంకం కలిగించడంతో పాటు దాడి యత్నించారు. ఏపీవో ఫిర్యాదు మేరకు పది మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రసాద్‌గౌడ్‌ను శుక్రవారం చేయగా మిగిలిన 9మంది కోసం గాలిస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

వివాహిత అదృశ్యం



పెంచలమ్మ

వెంకటగిరి టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సీసీ కండ్రిగ గ్రామానికి చెందిన వేలూరు రాజా భార్య పెంచలమ్మ అదృశ్యం అయిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. రాజా కథనం మేరకు... అన్నమయ్య జిల్లా చిట్వేలి మండలం అగ్రహారం గ్రామానికి చెందిన పెంచలమ్మతో ఎనిమిది నెలల క్రితం రాజాకు వివాహం జరిగింది. గురువారం దీపావళి పండగ కోసం అత్తగారి ఇంటికి వెళ్లడానికి రాజా దంపతులు బయలుదేరారు. రాపూరులో బస్సు కోసం నిరీక్షిస్తుండగా పెంచలమ్మ అదృశ్యం అయింది. బస్టాండ్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో గాలించినా కనిపించలేదు. పెంచలమ్మ తల్లిదండ్రులను ఫోన్ చేసి ఆరా తీసినా ఇంటికి రాలేదని చెప్పారు. దీంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బస్టాండ్‌లోని సీసీ ఫుటేజీ పరిశీలించగా బస్టాండ్ నుంచి బయటకు పోతున్నట్లు కనిపించింది. కాగా, ఫిర్యాదు స్వీకరించే విషయంలో రాపూరు, వెంకటగిరి పోలీసులు సాకులు చెప్పి తప్పించుకోజూడడంతో బాధితులు అసహనం వ్యక్తం చేశారు. రాపూరులో ఫిర్యాదు ఇస్తే వెంకటగిరిలో, వెంకటగిరిలో ఫిర్యాదు ఇస్తే మిస్సింగ్ అయింది రాపూరులో కాబట్టి అక్కడే ఫిర్యాదు చేయాలని చెప్పి తప్పించుకున్నారు. చివరకు యువతి తల్లిదండ్రులు రాపూరులో, రాజా వెంకటగిరిలో ఫిర్యాదు చేశారు.

హామీలన్నీ నేరవేరుస్తాం: పాశిం



మహిళలకు గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పాశిం

కోట/వాకాడు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నేరవేరుస్తున్నామని, ఏ ఒక్క హామీని విస్మరించే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. కోట మండల పరిధిలోని వెంకన్నపాళెంలో శుక్రవారం మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల అమలులో భాగంగా ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లను అందించే కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. త్వరలోనే మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించనున్నట్లు తెలిపారు. అనంతరం నాలుగు పంచాయతీల్లోని పొదుపు సంఘాలకు రూ.కోటి రుణాలకు సంబంధించి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సర్వోత్తమరెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు జలీల్ అహ్మద్, టీడీపీ జిల్లా కార్యదర్శి తీగల సురేష్, బీజేపీ నేత పునబాక కోటేశ్వరరావు, చిల్లకూరు దశరధరామిరెడ్డి, మధుయాదవ్, జగన్‌మోహన్‌రెడ్డి, సురేష్, తహసీల్దారు జయజయరావు, ఎంపీడీవో వేణు, ఏపీఎం అనీల తదితరులు పాల్గొన్నారు. ● వాకాడు మండలం కొండూరులో మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లను ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, సన్నారెడ్డి విజయశేఖర్‌రెడ్డి, పాపారెడ్డి పురోషోత్తంరెడ్డి, చిల్లకూరు దశరధరామిరెడ్డి, కుంచం దయాకర్, దోశకాయల కృష్ణమూర్తి, తిరుమూరు శ్రీనివాసులురెడ్డి, నందగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: కురుగొండ్ల



మంచం మీదున్న వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న కురుగొండ్ల

డక్కిలి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని శ్రీపురం దళితవాడలో పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం వృద్ధులు, వికలాంగులు, వితంతవులు, కిడ్నీ, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు పింఛన్లు అందించి అండగా నిలుస్తోందన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీనే లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. అధ్వానంగా ఉన్న శ్రీపురం రోడ్డుకు మరమ్మతులు చేయిస్తామని హామీ ఇచ్చారు. అలాగే గ్రామంలో రామాలయ నిర్మాణానికి టీటీడీ ద్వారా నిధులు ఇప్పించి పూర్తి చేస్తామన్నారు. అంతకు ముందు ఆయన పలుగోడు గ్రామంలోనూ పింఛన్లు పంపిణీ చేశారు. గ్రామంలో ఇళ్లపై వెళుతున్న విద్యుత్ లైన్లు మార్చాలని గ్రామస్తులు కోరగా వెంటనే విద్యుత్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో గుణశేఖర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, రంగినుని రాజా, డక్కిలి చంద్రారెడ్డి, రామూర్తి, పచ్చూరి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత గ్యాస్‌తో బలహీన వర్గాలకు ఎంతో మేలు: కలెక్టర్ వెంకటేశ్వర్

తడ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న గ్యాస్ సిలిండర్లతో బలహీన వర్గాల కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. శుక్రవారం తడ మండలం రామాపురం ఉన్నత పాఠశాల ఆవరణలో దీపం పథకం-2ను ఎమ్మెల్యే విజయశ్రీతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల అమలుకు శ్రీకారం చుట్టిందన్నారు. ఇందులో ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు, పింఛన్ల పెంపు ఇప్పటికే అమలు చేస్తుండగా ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లను దీపావళి కానుకగా అందిస్తున్నట్లు తెలిపారు. త్వరలో డీఎస్సీ నోటిఫికేషన్ వెలువడనుందని చెప్పారు. అలాగే మత్స్యకారుల చిరకాల కోర్కైన పులికాట్ పూడికతీతకు సాగరమాల పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని, త్వరలోనే టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి ఏడాదిన్నరలోపు పులికాట్ జలకళ సంతరించుకునేలా చేస్తామన్నారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో పేదలకు పట్టెడన్నం పెట్టే అన్న క్యాంటీన్లను మూసేసి బడుగల కడుపుకొట్టిందన్నారు. టీడీపీ ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోతందన్నారు. ఇందులో భాగంగా సిమెంటు రోడ్ల నిర్మాణం కోసం సూళ్లూరుపేట నియోజకవర్గానికి రూ.12 కోట్లను కేటాంచారని తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేశారు. ఇరకంలో ఏఎన్ఎం నియమించాలని, తడ రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారిలో మద్యం షాపును మరోచోటుకు తరలించాలని స్థానికులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో కిరణ్మయి, తహసీల్దారు శరత్‌బాబు, ఎంపీడీవో విజయకుమార్, జనసేన నాయకుడు ఉయ్యాల ప్రవీణ్, టీడీపీ నాయకులు మురళీరెడ్డి, సుధాకర్‌రెడ్డి, బొమ్మన శ్రీధర్, నీలకంఠం, సెల్వం, పళణి, బీజేపీ నాయకులు ఆదినారాయణరెడ్డి, కృష్ణమూర్తి, సర్పంచు టీకే.శ్రీనివాసన్, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే భవిష్యత్తుకు భరోసా: కురుగొండ్ల



గ్యాస్ సిలిండరు అందజేస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

బాలాయపల్లి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ముందు చూపుతో ఆలోచించే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే భవిష్యత్తుకు భరోసా లభిస్తుందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో దీపం పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసేందుకు ముఖ్యమంత్రి ప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు. మన బిడ్డల భవిష్యత్తు బాగుండాలన్నా, రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమవుతుందన్నారు. ఈ సందర్భంగా మన్నూరు గ్రామస్తులు తమ గ్రామంలోని ప్రభుత్వ భూములను బయట ప్రాంతాలకు చెందిన వారికి అమ్మేస్తున్నారని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. తక్షణమే ఆక్రమణలు తొలగించాలని తహసీల్దార్‌కు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో సర్పంచు దట్టం అంజలి, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో వినీల్ కుమార్, డీటీ శిరీష, టీడీపీ మండల అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు, ప్రధాన కార్యదర్శి కూను శ్రీహరి, రాయి సత్యం నాయుడు, కొర్రపాటి రామచంద్రనాయుడు, దాసరి రాజగోపాల్ నాయుడు, దాసరి ప్రభాకర్ నాయుడు, మద్దూరు కృష్ణ, ముప్పాళ్ల మాధవ నాయుడు, ఆది వెంకటకృష్ణారెడ్డి, తాళ్లూరు ప్రసాద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నేరవేరుస్తుంది: పాశిం



పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నేరవేర్చడం జరుగుతుందని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం గూడూరు పట్టణంలోని 1వ వార్డులో పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా 1వ తేదీన నేరుగా లబ్ధిదారుల ఇంటికెళ్లి పింఛను అందిస్తున్నామన్నారు. మహిళలకు ఏడాదికి ఉచితంగా అందించే గ్యాస్ సిలిండర్ల పథకాన్ని దీపావళి సందర్భంగా ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదన్నారు. నిరుపేదలకు నివాస స్థలం కేటాయించడంతో పాటు ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా ఇల్లు నిర్మించుకునేందుకు రూ.4లక్షలు ఆర్థికసాయం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, నాయకులు గోను శివకుమార్, గురవయ్య, కోటేశ్వరరావు, శివ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక ఏఎరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఉపాధ్యాయులు ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌ను కలిసి కందలి గ్రామంలోని పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు సిద్దయ్యకు అనారోగ్యంగా ఉండడంతో సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి సాయం అందించాలని కోరారు. ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందించేలా చర్యలు తీసుకోవడంతో పాటు తనవంతుగా వైద్య ఖర్చుల నిమిత్తం రూ.లక్ష అందజేస్తానని ఎమ్మెల్యే చెప్పడంతో ఉపాధ్యాయులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా గురువారం స్థానిక వీరభద్రస్వామి ఆలయంలో దీపావళి సందర్భంగా రెడ్ సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులకు దుస్తులు, టపాసులు పంపిణీ చేశారు. దివ్యాంగులకు చేయూతనిచ్చేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్న రెడ్ సంస్థకు ఎమ్మెల్యే తనవంతు సాయంగా రూ.లక్ష అందజేశారు. అదేవిధంగా స్థానిక సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో టీడీపీ పట్టణ కమిటీ కార్యదర్శి అమరయ్య నాయుడు పుట్టినరోజు నిర్వహించి వృద్ధులకు అన్నదానం చేశారు.

ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ

చిట్టమూరు/డక్కిలి/పెళ్లకూరు/ఓజిలి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): చిట్టమూరు స్త్రీశక్తి భవనంలో శుక్రవారం మహిళలకు ఉచిత గ్యాస్ సిలెండర్లు పంపిణీ చేపట్టారు. తహసీల్దారు ప్రసాద్, ఎంపీడీవో మనోహర్ గౌడ్, గణపర్తి గోపాల్ నాయుడు, బాబు నాయుడు, సర్పంచు మీదూరు కోటయ్య పాల్గొన్నారు. ● డక్కిలి ఎంపీడీవో కార్యాలయంలో మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి అధికారులతో కలిసి మహిళలకు ఉచితంగా గ్యాస్ సిలిండర్లును పంపిణీ చేశారు. తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో గుణశేఖర్, ఎంఈవోలు వెంకటేశ్వర్లు, జగదీష్ బాబు, ఏపీఎం జమునారాణి పాల్గొన్నారు. ● పెళ్లకూరు, కొత్తూరు గ్రామాల్లో ఉచిత గ్యాస్ సిలిండర్లను అందజేశారు. తహసీల్దార్ ద్వారకానాద్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, మండల ప్రధాన కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, సీనియర్ నాయకుడు పేరం రమేష్ నాయుడు, సిద్దులయ్య నాయుడు, మురళీ నాయుడు తదితరులు పాల్గొన్నారు. ● ఓజిలిలో ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దారు పద్మావతి, వెలుగు ఏపీఎం పద్మ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా బీసీసెల్ ఉపాధ్యక్షుడు పాడి వెంకటసుబ్బయ్య, టీడీపీ మండల కన్వీనరు గుజ్జలపూడి విజయకుమార్ నాయుడు, ఉపాధ్యక్షుడు దువ్వూరు శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు. పొదుపు మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం గురించి ఏపీఎం పద్మ అవగాహన కల్పించారు. మహిళలకు గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేశారు.

పేదలకు అండగా నిలవండి

పెళ్లకూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పేదలకు అండగా నిలవాలని కేఆర్ ఛారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు వేలూరు కళ్యాణ్‌రెడ్డికి సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ సూచించారు. దీపావళి పండుగ సందర్భంగా గురువారం కళ్యాణ్‌రెడ్డి ఎమ్మెల్యే విజయశ్రీ, పార్థసారథి దంపతులను కలిసి సత్కరించారు.

మహిళలు మమోగ్రామ్ పరీక్ష చేయించుకోవాలి

తడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక దశలో క్యాన్సర్‌ను గుర్తించేందుకు 35 యేళ్లు దాటిన మహిళలు మమోగ్రామ్ పరీక్ష చేయించుకోవాలని రామాపురం పీహెచ్‌సీ వైద్యురాలు జయశ్రీదేవి సూచించారు. శుక్రవారం భీములవారిపాళెం గ్రామంలో తిరుపతి సిమ్స్, శ్రీబాలాజీ ఇనిస్టూట్ ఆఫ్ అంకాలజి ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ చైతన్యభాను, ఎంపీటీసీ రమేష్, సర్పంచు గీతాప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పరసా రత్నానికి కిలివేటి పరామర్శ



సూళ్లూరుపేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): గుండె ఆపరేషన్ చేసుకొని తిరుపతిలో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకొంటున్న మాజీ మంత్రి పరసా వెంకటరత్నంను మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య శుక్రవారం పరామర్శించారు. ఆయన వెంట సూళ్లూరుపేట ఎంపీపీ అల్లూరు అనిల్‌రెడ్డి, ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, వైసీపీ నాయకులు జెట్టి వేణుయాదవ్ ఉన్నారు.

యువకుడిపై కత్తితో దాడి

నాయుడుపేట టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుదూరు గ్రామానికి చెందిన చైతన్యపై అదే గ్రామానికి చెందిన చెందు మరో కొంతమందితో కలిసి కత్తితో దాడి చేశాడు. అడ్డుకోబోయిన చైతన్య అవ్వ పోలమ్మకు కూడా గాయాలయ్యాయి. క్షతగాత్రులను నాయుడుపేట ప్రభుత్వాత్రికి తరలించారు.

ఎమ్మెల్సీ మేరిగ ఆరోపణలు అసత్యం: టీడీపీ



సమావేశంలో టీడీపీ నాయకులు

గూడూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్‌పై వైసీపీ ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ అసత్య ఆరోపణలు చేయడం తగదని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీడీపీ నేతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం కోట గ్రామంలో వైసీపీ ఎమ్మెల్సీ మేరిగ మురళి నిర్వహించిన సమావేశంలో కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత రౌడీయిజం పెరిగిపోయిందని, ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు చేయడం మంచిపద్ధతి కాదన్నారు. మహిళా ప్రభుత్వ ఉద్యోగినిపై వైసీపీ నాయకులు దౌర్జన్యం చేయడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసిందన్నారు. ఈ విషయాన్ని గుర్తించకుండా ఎమ్మెల్సీ మాట్లాడడం సమం జసం కాదన్నారు. పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, వెంకటేశ్వర్లురాజు, ఇశ్రాయిల్ కుమార్, రవీంద్రరెడ్డి, పెంచలయ్య, సునీల్ పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి
ఐదు లక్షల ఆర్థికసాయం

చిల్లకూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాంచారమ్మపేట గ్రామంలో హత్యకు గురై మృతిచెందిన టీడీపీ కార్యకర్త హరిప్రసాద్ కుటుంబసభ్యులకు శుక్రవారం ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, పెంచలకోన ఆలయ ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ తానంకి నానాజీ రూ.5లక్షల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ దృష్టికి తీసుకువెళ్లి హరిప్రసాద్ కుటుంబానికి మరింత సాయం అందించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, పూడిపర్తి ప్రవీణ్ కుమార్ రెడ్డి, పెజ్జాయి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


దీపావళి కానుకగా ఉచిత గ్యాస్ పథకం



గ్యాస్ సిలిండర్లు అందజేస్తున్న టీడీపీ నేతలు

గూడూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా దీపావళి కానుకగా మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ పథకాన్ని ప్రారంభించినట్లు తిరుపతి పార్లమెంటు టీడీపీ రైతుకమిటీ కార్యదర్శి దుద్దా రాఘవరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని తిప్పవరప్పాడు గ్రామంలో ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా మహిళలు గ్యాస్ కోసం చెల్లించే రూ. 840 నగదు 48 గంటల్లోగా తిరిగి వారి ఖాతాల్లో జమకావడం జరుగుతుందన్నారు. ఇచ్చిన హామీలను నేరవేర్చే సమర్థత సీఎం చంద్రబాబునాయుడుకే ఉందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లురాజు, తిరుపతి మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి, శ్రీనివాసులురెడ్డి, తహసీల్దారు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గూడూరు అర్బన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైన గూడూరు మండలంలోని నెల్లటూరు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులను శుక్రవారం ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి హెచ్ఎం రామయ్య మాట్లాడుతూ తమ పాఠశాలలో చదువుతున్న సాకేత్‌కుమార్, గురుఅర్జున్ ఇటీవల నెల్లూరులో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి యోగా పోటీల్లో ప్రతిభచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. శనివారం నుంచి నెల్లూరులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పీడీ విజయ పాల్గొన్నారు.

గ్యాస్ ఏజెన్సీల వద్ద రద్దీ

గూడూరు అర్బన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో భాగంగా ఏడాదికి ఉచిత మూడు గ్యాస్ సిలిండర్ల పంపిణీకి శ్రీకారం చుట్టింది. దీంతో కొంతమంది వినియోగదారుల ఫోన్‌లకు మేసేజ్‌లు వచ్చాయి. మేసేజ్‌లు రాని తెల్లరేషన్ కార్డుదారులు తమ పేర్లు అర్హుల జాబితాలో ఉన్నాయా లేదా అని తెలుసుకునేందుకు శుక్రవారం స్థానిక గ్యాస్ ఏజెన్సీల వద్ద బారులుతీరారు.